
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు జిల్లా వార్తలు
శుక్రవారం 11 ఏప్రిల్ 2025

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755



నేడో, రేపో ఏఎంసీ పోస్టుల భర్తీ

● ఎమ్మెల్యేల సిఫార్సులే ఫైనల్

చిత్తూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ కమిటీ చైర్మన్ పోస్టుల భర్తీ కసరత్తు పూర్తయి చాలాకాలమైనా ప్రకటించడంలో ఆలస్యమవుతోంది. జిల్లాలో మొత్తం 10 పోస్టులుండగా, రెండు చోట్ల మాత్రమే ఇటీవల ప్రకటించారు. జిల్లాలోని అన్ని పోస్టులకు పేర్లను అప్పట్లోనే ఖరారు చేసినా మరో 8 పోస్టులను మాత్రం ప్రకటించలేదు. వీటిని రెండు మూడు రోజుల్లో ప్రకటించే అవకాశాలున్నట్లు ఎమ్మెల్యేలకు సమాచారం అందింది. అధికార పార్టీ ఎమ్మెల్యేలున్న చోట్ల వారు సూచించిన నేతలను, లేని చోట్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జులు సిఫార్సు చేసిన పేర్లనే అధిష్ఠానం ఖరారు చేసినట్లు సమాచారం. అయితే వారు సిఫార్సు చేసిన నేతల సేవలను టీడీపీ అధిష్ఠానం మరో ఛానెల్ ద్వారా చెక్ చేసుకున్నట్లు తెలుస్తోంది. పార్టీ విజయానికి కృషి చేసినవారికే చైర్మన్‌గిరి దక్కుతున్నట్లు చెబుతున్నారు.చైర్మన్ పోస్టులు టీడీపీకి దక్కనుండగా కొన్ని డైరెక్టర్ పోస్టుల్లో జనసేన, బీజేపీ నాయకులకు అవకాశం కల్పించనున్నట్లు తెలుస్తోంది.ఇదివరకే ప్రకటించిన ఎస్ఆర్‌పురం, నగరి మార్కెట్ కమిటీ చైర్మన్ల పోస్టులను ఎమ్మెల్యేలు వీఎం థామస్, గాలి భానుప్రకాష్ సిఫార్సు చేసిన వారికే ఇచ్చారు. ఎస్ఆర్‌పురంలో థామస్‌కు ముఖ్య అనుచరుడు గుండయ్య సతీమణి జయంతికి, నగరిలో టీడీపీ పుట్టుక నుంచీ పార్టీలోనే కొనసాగుతున్న సీనియర్ నేత సుబ్రమణ్యం రాజు సతీమణి రాజమ్మ పేర్లను ఖరారు చేశారు.● జీడీనెల్లూరు నియోజకవర్గంలో ఖాళీగా వున్న పెనుమూరు ఏఎంసీ చైర్మన్ పోస్టుకు జీడీనెల్లూరు మండలం పాతపాళ్యం పంచాయతీ మిట్టకొత్తూరుకు చెందిన వ్యాపారవేత్త వై.కృష్ణమ నాయుడి పేరును ఎమ్మెల్యే సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది● చిత్తూరు మార్కెట్ కమిటీకి గత ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేసిన మాపాక్షికి చెందిన బీసీ నేత వెంకటేష్ యాదవ్ పేరును తొలుత ఖరారు చేశారు. రిజర్వేషన్ల అడ్జస్ట్‌మెంట్లలో భాగంగా ఆయన సతీమణికి ఇవ్వనున్నట్లు తెలుస్తోంది●పూతలపట్టు నియోజకవర్గ పరిధిలోని బంగారుపాళ్యం మార్కెట్ కమిటీకి తవణంపల్లె మండలానికి చెందిన భాస్కర నాయుడి పేరును నియోజకవర్గంలోని నాయకుల సమ్మతితో ఎమ్మెల్యే మురళీమోహన్ సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలో ఒకటే కమిటీ ఉండగా.. స్థానిక కీలక నాయకులు మూడు పేర్లను సూచించారు. ఈ ముగ్గురిలో ఒకరిని ఎంపిక చేసి ప్రకటించనున్నారు.● పలమనేరులో ఒకటే మార్కెట్ కమిటీ ఉండగా.. అక్కడ ఎస్సీ రిజర్వేషన్ ఉండగా, మరోసారి బీసీ మహిళ రిజర్వేషన్ వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో పలమనేరు చైర్మెన్ పేరును ఖరారు చేయనట్లు తెలుస్తోంది.● పుంగనూరు నియోజకవర్గంలో పుంగనూరు, రొంపిచెర్ల, సోమలలో మార్కెట్ కమిటీలున్నాయి. ఇక్కడ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆయా పేర్లను ఖరారు చేసి అధిష్ఠానానికి పంపారు.

'కుప్పం మున్సిపాలిటీ రూపు మారబోతోంది. అంతర్జాతీయ కన్సల్టెంట్లతో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నాం. యూజీడీ వస్తుంది. ఇంటింటికీ తాగునీటి పైపులైన్ ఇస్తాం. ఎలక్ట్రిక్ తీగలు సైతం భూగర్భంలోనే ఇక ఉండబోతున్నాయి. రెండేళ్లకల్లా మీరు అభివృద్ధి చెందిన కుప్పం మున్సిపాలిటీని చూడబోతున్నారు.'

- కడా పీడీ వికాస్ మర్మత్ ఇటీవల విలేకరుల సమావేశంలో సగర్వంగా చెప్పిన మాటలివి.

'వర్క్‌ప్రెజర్ ఎక్కువగా ఉంటోంది. ముఖ్యమంత్రి నియోజకవర్గం కావడంతో ఒకేసారి అనేక సర్వేలు, అభివృద్ధి పనులు, సేవలు అందించాల్సిన పరిస్థితి. దానికి తగ్గ స్టాఫ్ లేరు. ఉన్నవాళ్లతో సర్దుకుపోయే పరిస్థితి కాదు. ఎప్పటికప్పుడు అప్డేట్స్ పైవారికి ఇవ్వాలి. అందుకు సరిపడినంత స్టాఫ్ ఉంటేనే అది సాధ్యమవుతుంది.'

- ఏ మున్సిపల్ ఉద్యోగిని కదిలించినా చెప్పుకుంటున్న గోడు ఇది.

ఆ 44 పోస్టుల భర్తీ ఎన్నడో..!

● పనివత్తిడి భయంతో వెనకాడుతున్న ఉద్యోగులు ● కుప్పం మున్సిపల్ కార్యాలయంలో సిబ్బంది కొరత
● సచివాలయాలకు డిప్యుటేషన్‌పై 45 మంది



కుప్పం మున్సిపల్ కార్యాలయం

కుప్పం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కుప్పం మున్సిపాలిటీని సిబ్బంది కొరత తీవ్రంగా పీడిస్తోంది. ఇటీవల కొత్తగా డిప్యుటేషన్ మీద వచ్చిన సిబ్బంది విధుల్లో చేరారు. అయితే సుమారు నెలా రెండు నెలల క్రితం కేవలం మున్సిపల్ కార్యాలయానికి మంజూరు చేసిన 44 పోస్టులు భర్తీ కాకపోవడంతో పని వత్తిడి ఏమాత్రం తగ్గడంలేదు. నగర పంచాయతీగా ఉన్న కుప్పానికి పరిసరాల్లోని మరో 6 పంచాయతీలను కలుపుతూ 2020లో పురపాలక సంఘం చేస్తూ అప్పటి వైసీపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు జీవో ఇచ్చినా, అందుకు తగిన నిర్మాణపరమైన చర్యలు మాత్రం తీసుకోలేదు. దీంతో నిన్నమొన్నటిదాకా మున్సిపల్ కమిషనర్ కూడా పంచాయతీ ఈవో హోదాలోనే కొనసాగాల్సిన దుస్థితి నెలకొంది. పంచాయతీ సిబ్బంది 15 మందితోనే నెట్టుకు వచ్చారు. చివరకు ఆర్థిక శాఖ వద్ద పెండింగులో ఉన్న ఫైలు కదిలి కమిషనర్ పోస్టుతోపాటు, మొత్తం 44 పోస్టులు కుప్పం మున్సిపాలిటీకి మంజూరయ్యాయి. అప్పటికే ఉన్న పంచాయతీ సిబ్బందికి తోడు మున్సిపాలిటీ పరిధిలోని 12 సచివాలయాల్లో 52 మంది సిబ్బంది డిప్యుటేషన్ మీద వచ్చారు. వీరంతా ఇటీవలే రెగ్యులర్ అయ్యారు. వీరుగాక మరో 45 మంది సిబ్బందిని డిప్యుటేషన్ మీద ప్రభుత్వం కేవలం కుప్పం సచివాలయాలకే నియమిస్తూ సుమారు నాలుగైదు రోజుల క్రితం జీవో ఇచ్చింది. ఆయా పోస్టుల్లో నియమితులైన సిబ్బంది కూడా దాదాపు వంద శాతం బాధ్యతలు తీసుకున్నారు.

44పోస్టుల్లో 30 దాకా ఖాళీ

కుప్పం మున్సిపాలిటీకి 44 పోస్టులు మంజూరు చేస్తూ టీడీపీ ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి నెల 4వ తేదీన జీవో విడుదల చేసింది. మున్సిపల్ కమిషనర్, మేనేజర్, ఆరు సీనియర్ అసిస్టెంట్, ఆరు జూనియర్ అసిస్టెంట్ పోస్టులతోపాటు అవసరమైన అన్ని రకాల పోస్టులు మంజూరైన పోస్టుల్లో ఉన్నాయి. అయితే ఇప్పటికే పనిచేస్తున్న ఉద్యోగులు తప్ప అదనంగా ఒక్కరు కూడా ఈ పోస్టుల్లో నియమితులు కాలేదు. మొత్తం 44 పోస్టుల్లో కనీసం 30 పోస్టుల దాకా ఖాళీగానే పడివున్నాయి. జిల్లాలోని ఏ ప్రాంతం వారిని కుప్పం మున్సిపాలిటీకి బదిలీ చేయాలన్నా వీలు కావడంలేదు. ఎవరెవరినో పట్టుకుని కుప్పం బదిలీ కాకుండా చూసుకుంటున్నారు. ఈ పరిస్థితి తలెత్తడానికి కుప్పం మారుమూల ప్రాంతం కావడం ఒక్కటే కారణం కాదు. అంతకుమించి ఉద్యోగులు చెబుతున్న కారణం.. పనివత్తిడి. కుప్పం మున్సిపాలిటీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలోని ప్రధానమైన ప్రాంతం. ఇక్కడ అభివృద్ధి పనులకోసం కోట్ల రూపాయల నిధులను ఇప్పటికే ప్రభుత్వం మంజూరు చేసింది. నక్ష సర్వేకు ఎంపికైంది. అంతేకాదు.. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా రకరకాల సర్వేలు జరుగుతున్నాయి. కుప్పం అభివృద్ధిపై కడా పీడీ ద్వారా నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయం ఎప్పటికప్పుడు నివేదికలను తెప్పించుకుంటోంది. వీటన్నింటి వల్ల ఉద్యోగులపై పని వత్తిడి తీవ్ర స్థాయిలోనే ఉంది. కనీసం మంజూరైన పోస్టులు భర్తీ చేసినా పరిమితంగా ఉన్న ఉద్యోగులపై పనిభారంలో కొంత తగ్గుతుంది.కానీ వీరి పనివత్తిడి గురించి తెలుసుకుంటున్న జిల్లాలోని ఇతర ప్రాంతాల్లోని ఉద్యోగులు కుప్పం బదిలీ అంటే భయపడిపోతున్నారు. దీనిపై కడా పీడీ వికాస్ మర్మత్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఎపిషియంట్ ఆఫీసర్స్‌కోసం చూస్తున్నామన్నారు. రెండు మూడు నెలల్లో పోస్టులన్నింటినీ భర్తీ చేస్తామని తెలిపారు.

రేషనలైజేషన్ షురూ

సచివాలయాల్లో క్లస్టర్లవారీ విభజన పూర్తి

మిగులు సిబ్బంది 600నుంచి 700 మంది



చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సేవలను మరింత చేరువ చేసేందుకు కూటమి ప్రభుత్వం హేతుబద్ధీకరణ చేపట్టింది. ఇందులో భాగంగా సచివాలయాలను క్లస్టర్లుగా విభజించే కార్యక్రమం పూర్తయ్యింది. సంబంధిత విధివిధానాలు తయారుచేయాలని సచివాలయ పాలన విభాగానికి, మండలపరిషత్‌లకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేయగా, అధికారులు వారం క్రితం పూర్తిచేశారు. దీంతో జిల్లా యంత్రాంగం క్లస్టర్ల విభజన ప్రారంభించి కసరత్తుచేసి ప్రభుత్వానికి నివేదిక పంపారు. మిగులు ఉద్యోగులు 600 నుంచి 700 మంది ఉన్నట్లు ప్రాథమిక అంచనా వేశారు.

విభాగాలుగా సిబ్బంది

గ్రామ సచివాలయాల్లో 11 మంది, పట్టణాల్లో 9 మంది చొప్పున సిబ్బంది ఉంటారు. ప్రస్తుతం వీరిని పలు విభాగాలుగా విభజించారు.

● బహుళార్థక విభాగంలో నాలుగు కేటగిరీల ఉద్యోగులైన పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్లు ఉంటారు. వీరు సర్వేలు చేపడతారు. ఇతర సేవలను క్లస్టర్ స్థాయిలో అందిస్తారు.

● సాంకేతికత విభాగంలో వ్యవసాయ, సెరికల్చర్, ఉద్యాన, ఇంజనీరింగ్, ఆరోగ్య, పశుసంవర్ధక, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, విద్యుత్ సహాయకులు ఉంటారు.

● ఐటీలో ప్రవేశమున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఉద్యోగులను గుర్తించి ఇన్ఫర్మేషన్ విభాగంలో చేర్చుకున్నారు. వీరిని ఐటీ అవసరాలకు వినియోగించనున్నారు.

● రెవెన్యూ విభాగంలో వీఆర్వోలు, సర్వేయర్లు ఉంటారు.మహిళా పోలీసులను ఐసీడీఎస్ విభాగంలో లేదా పోలీసుస్టేషన్లలో నియమించనున్నారు.అయితే పలువురు పోలీసుస్టేషన్లలో విధులు నిర్వహించడానికి సుముఖత చూపడం లేదు.

సంగ్రహంగా...

జిల్లాలో సచివాలయాలు	612
ప్రతిపాదిత క్లస్టర్లు	310
ఉద్యోగులు	4432
మిగులు ఉద్యోగులు	600 - 700 మధ్య

● ఎంపీడీవోల ఆధ్వర్యంలో...

ప్రతి మండలంలో పక్కపక్కన ఉన్న సచివాలయాలను క్లస్టర్లుగా పరిగణిస్తారు. సచివాలయాలు సరిసంఖ్యలో ఉంటే సగం క్లస్టర్లు ఏర్పాటవుతాయి. ఉదాహరణకు 12 సచివాలయాలుంటే ప్రతి క్లస్టర్‌లో ఆరేసి సచివాలయాలను ఏర్పాటుచేస్తారు. బేసి సంఖ్యలో ఉంటే ఒక క్లస్టర్ పరిధిలోకి రెండు సచివాలయాలను తీసుకొస్తారు. బహుళార్థక విభాగంలో జనాభా ప్రాతిపదికన, సాంకేతిక విభాగంలో క్లస్టరు పరిధిలో ఉద్యోగులను గుర్తిస్తారు. వీరు రెండేసి సచివాలయాల్లో పనిచేయాల్సి ఉంటుంది. క్లస్టర్ల విభజన పనిని ఎంపీడీవోలు పూర్తిచేశారు. 2500 జనాభా వున్న చోట ఆరుగురు, 2501 నుంచి 3500 మంది ఉన్న చోట్ల ఎనిమిది మంది, ఆపై జనాభా ఉన్న సచివాలయాల పరిధిలో 10మంది సిబ్బందిని నియమించే విధంగా నివేదికలు తయారుచేశారు. ప్రస్తుతం పనిచేస్తున్న 4432 మంది సిబ్బందిలో సుమారు 600- 700 మధ్య సిబ్బందిని మిగులు ఉద్యోగులుగా గుర్తించారు.వీరిని ఏయే శాఖల్లో నియమించాలన్న దానిపై ఇంకా ప్రభుత్వం నుంచీ మార్గదర్శకాలు విడుదల కాలేదని గ్రామ సచివాలయాల జిల్లా కోఆర్డినేటర్, డీఎల్పీవో రవికుమార్ గురువారం రాత్రి ఆంధ్రజ్యోతికి తెలిపారు.

నేడు డీవీఎంసీ సమావేశం

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ (డీవీఎంసీ) సమావేశం శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు జరుగుతుందని జిల్లా ఎస్సీ సంక్షేమం, సాధికారత అధికారి చెన్నయ్య తెలిపారు. కలెక్టర్ సుమిత్ కుమార్ ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశానికి డీవీఎంసీ సభ్యులందరూ హాజరుకావాలని కోరారు.

నేడు బీసీ భవన్‌లో పూలే జయంతి వేడుకలు

● రూ. 11.66 కోట్ల ఆస్తుల పంపిణీ

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమాన్ని రాష్ట్రస్థాయి వేడుకగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు చిత్తూరులోని బీసీ భవన్‌లో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు జిల్లాస్థాయి వేడుక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా బీసీ కార్పొరేషన్ పరిధిలో అర్హులైన బీసీ, ఈబీసీ, కాపు, మైనార్టీ వర్గాలకు చెందిన 500 మందికి రూ.11.66 కోట్ల ఆస్తులను ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా పంపిణీ చేస్తారని వివరించారు. బీసీ సంఘాల నేతలు, అధికారులు హాజరై జయప్రదం చేయాలని కలెక్టర్ కోరారు.

26 లక్షల సెల్‌ఫోన్లలో 'మన మిత్ర'

● వాట్సాప్ సేవలపై ఇక ఇంటింటి ప్రచారం

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పౌర సేవలను సులభతరం చేసేందుకు వాట్సాప్ గవర్నెన్స్ -మన మిత్రను రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తోంది. ఇప్పటికే 250కి పైగా సేవలందిస్తోంది.జూన్‌నాటికి ఈ సంఖ్యను మరో 500కు పెంచాలని యోచిస్తోంది. నిరక్షరాసులు కూడా వినియోగించేలా వాయిస్ మెసేజ్‌తో పనిచేసేలా ఏఐ ఆధారిత చాట్‌బాట్‌ను కూడా జోడించింది. ఈ వాట్సాప్ సేవలపై విస్తృతస్థాయి ప్రచారం కొరవడింది. దీంతో ప్రజల సందేహాలను నివృత్తి చేసేలా సచివాలయ సిబ్బందితో ఇంటింటి ప్రచారానికి ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. ఇందులో భాగంగా జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించడంతో పాటు కరపత్రాలను పంపిణీ చేసేలా సన్నద్ధమవుతున్నారు. జిల్లావ్యాప్తంగా వాడుకలో ఉన్న సుమారు 26లక్షల సెల్ ఫోన్లలో మనమిత్ర వాట్సాప్ నెంబరు 9552300009ను నిక్షిప్తం చేయనున్నారని జిల్లా సచివాలయాల కో-ఆర్డినేటర్, డీఎల్‌పీవో రవికుమార్ తెలిపారు.

వర్షం.. ఆహ్లాదం

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఎండలు మండుతున్న వేళ చిత్తూరు నగరంలో గురువారం సాయంత్రం వర్షం కురిసింది. బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం కారణంగా చిత్తూరు నగరంలో సాయంత్రం 5 గంటల నుంచి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశమంతా మబ్బులు కమ్ముకుని చల్లబడింది. ఆ తరువాత జల్లులతో ప్రారంభమై వర్షంగా మారింది. ఎండల వేడిమితో ఇబ్బంది పడ్డ నగర ప్రజలు ఆహ్లాదవాతావరణంతో సేదదీరారు. పాలసముద్రం మండలంలో గురువారం సాయంత్రం 3.30 గంటల నుంచి నాలుగు గంటల వరకు వర్షం కురిసింది.చెరకు, కొబ్బరి తోటలకు ఈ వర్షం అనుకూలమని రైతులు తెలిపారు.

చిత్తూరు సీబీ రోడ్డులో వర్షం




పిడుగుపాటుకు ఎద్దు మృతి

గుడిపాల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గుడిపాల మండలంలోని మారుమూల ప్రాంతమైన చిత్తపార గ్రామంలో గురువారం రాత్రి పిడుగుపాటుకు ఓ ఎద్దు మృతి చెందింది. కొద్దిపాటి వర్షం కురుస్తుండగా, భారీగా ఉరుములు, మెరుపులు వచ్చాయి. ఆపై పిడుగుపడిన శబ్దానికి స్థానికులు భయపడ్డారు. వర్షం ఆగాక చూస్తే గ్రామానికి చెందిన చంద్రన్ అనే రైతుకు చెందిన ఎద్దు పిడుగుపాటుకు మృతి చెందిందని గుర్తించారు.

తరచూ తాగునీటి నాణ్యతను పరీక్షించండి

● అధికారులకు కలెక్టర్ సూచన

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): 'వేసవిలో తాగునీటి సమస్య లేకుండా ప్రజలకు అందించాలి. ఇందులో భాగంగా తరచూ తాగునీటి నాణ్యతను పరీక్షించాలి' అని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో తాగునీటి సమస్య తలెత్తకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై గ్రామీణ నీటి సరఫరా శాఖ డీడీ, ఏఈలతో ఆయన సమీక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులను 15 రోజులకు ఒకసారి క్లీనింగ్ చేయాలని, ఆ ఫొటోలు తీసి తనకు పంపాలన్నారు. లీకేజీ ఉన్న పైపులను వెంటనే రీప్లేస్ చేయాలని చెప్పారు. లేదంటే మురుగు చేరి, నీరు కలుషితమై వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేసిన పనులకు సంబంధించిన బిల్లులను జిల్లా పరిషత్‌కు పంపాలని, వాటిని వెంటనే పాస్ చేయాలని జడ్పీ సీఈవోను ఆదేశాలిచ్చారు. విద్యుత్ సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలన్నారు. విజయపురం, నింద్ర మండలాల్లోని 44 గ్రామాలలో తాగునీటిని అందిస్తున్నామని ఎస్ఈ విజయ్‌కుమార్ కలెక్టర్‌కు తెలిపారు. ఈ సమావేశంలో డీపీవో సుధాకర్‌రావు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

నేటి ఉద్యాన సదస్సుకు విస్తృత ఏర్పాట్లు

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో శుక్రవారం నిర్వహించే ఉద్యాన సదస్సును విజయవంతం చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. సదస్సు నిర్వహణ, ఏర్పాట్లపై గురువారం కలెక్టరేట్‌లోని తన సమావేశ మందిరంలో ఉద్యాన, వ్యవసాయ అనుబంధ శాఖలు, పౌరసరఫరాల సంస్థ, శాఖ, డీఆర్‌డీఏ, డీఎస్‌డీఏవో అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌పీఎస్ పెవిలియన్ కన్వెన్షన్ హాలులో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు మామిడి అమ్మకం, కొనుగోలుదారులతో ఎగుమతి అవకాశాలపై రైతులతో నిర్వహించే ఈ సదస్సులో పొరపాట్లు జరగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాష్ట్ర స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, సుమారు 500 మంది రైతులు పాల్గొంటారన్నారు.సమావేశంలో వ్యవసాయాధికారి మురళీకృష్ణ, పట్టుపరిశ్రమ శాఖ జేడీ శోభారాణి, ఉద్యానశాఖ డీడీ మధుసూదన్‌రెడ్డి, డీఎస్‌డీవో శంకరన్, డీఎం సివిల్ సప్లయిస్ బాలకృష్ణ, డీఆర్‌డీఏ పీడీ రవి తదితరులు పాల్గొన్నారు.

23 మంది ఈవోపీఆర్డీలకు పదోన్నతి

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి):పంచాయతీరాజ్ శాఖ ప్రక్షాళనలో భాగంగా పంచాయతీరాజ్ చట్టంలో పలు సవరణలు చేస్తూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. మొదట ఉద్యోగుల క్యాడర్ విషయంలో తారతమ్యాలు లేకుండా చేయాలని నిర్ణయించారు. ఈవోపీఆర్డీ క్యాడర్‌ను డిప్యూటీ ఎంపీడీవోలుగా పరిగణిస్తారు. ప్రస్తుతం ఈవోపీఆర్డీలుగా పనిచేస్తున్న 23 మంది క్యాడర్ డిప్యూటీ ఎంపీడీవోలుగా మారనుంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై జిల్లాలోని ఈవోపీఆర్డీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

21న మోడల్ స్కూళ్ల ప్రవేశ పరీక్ష

చిత్తూరు(సెంట్రల్), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూళ్లలో ఆరవ తరగతి ప్రవేశాలకు ఈ నెల 20న నిర్వహించదలచిన ప్రవేశ పరీక్షను 21వ తేదీకి మార్చినట్టు పాఠశాల విద్యాశాఖ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. 20న ఈస్టర్ పర్వదినం రావడంతో ఈ మేరకు మార్పు చేసినట్టు ప్రకటించింది. **ఎన్ఈపీ అమలుకు స్టేట్ టాస్క్ ఫోర్స్** : పాఠశాల విద్యాశాఖలో జాతీయ విద్యావిధానం అమలుకు స్టేట్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటైంది.పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ చైర్మన్‌గా,ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.విద్యాశాఖ కమిషనర్ వి.విజయరామరాజు, సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు, ఇతర అధికారులు సభ్యులుగా వుంటారు.ఎన్ఈపీ అమలు ఎంతవరకు వచ్చింది? మొత్తం విధానం అమలుచేసేందుకు ఇంకా చేపట్టాల్సిన చర్యలపై ఈ కమిటీ కసరత్తు చేస్తుంది.

టీటీడీకి విరాళంగా వంద సైకిళ్లు



తిరుమల శ్రీవారికి గురువారం వంద సైకిళ్లు విరాళంగా అందాయి. చెన్నైకు చెందిన మురుగప్ప గ్రూప్ టీఐ సైకిల్స్ ఆఫ్ ఇండియా సంస్థ ప్రతినిధులు వీటిని ఆలయ డిప్యూటీఈవో లోకనాథంకు అందజేశారు. ఈకార్యక్రమంలో పేష్కార్ రామకృష్ణ, ఇన్‌చార్జ్ డీఐ హరిబాబు పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారిసేవలో కేంద్రమంత్రి



జ్యుయల్ ఓరం

తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. కేంద్రమంత్రి జ్యుయల్ ఓరం, ఎంపీ కేశినేని చిన్ని(శివనాథ్), నిర్మాత అంబిక కృష్ణ, మాజీ డీజీపీ దినేష్‌రెడ్డి ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమలలో 'అర్జున్ సన్ఆఫ్ వైజయంతి' బృందం

'అర్జున్ సన్ఆఫ్ వైజయంతి' చిత్ర హీరో కల్యాణ్‌రామ్, దర్శకుడు ప్రదీప్, నటుడు పృద్వీరాజ్, చిత్ర బృందంతో కలిసి విజయశాంతి గురువారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో ఆమె మాట్లాడుతూ, ఈ సినిమా 18న విడుదల కాబోతోందని, తప్పకుండా రెండు రాష్ట్ర ప్రజలు సినిమాను చూసి పెద్ద హిట్ చేయాలని కోరుకుంటున్నానని అన్నారు. తమ సినిమాను అందరు తప్పకుండా చూసి ఆదరించాలని హీరో కల్యాణ్‌రామ్ కోరారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



ఆలయం ముందు విజయశాంతి, కల్యాణ్‌రామ్


సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 30 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.27 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 62,076

తలనీలాలు సమర్పించినవారు: 23,699



● నేడు పెంపుడు జంతువుల దినోత్సవం

పెంచితే పంచేను ప్రేమ



శివ



కొసింత దగ్గరకు తీసుకుంటే కొండంత అభిమానాన్ని చూపిస్తాయి. ప్రేమగా సాకితే ప్రాణమే పెడతాయి. తమ చిన్ని పొట్టను నింపితే జీవితాంతం విశ్వాసం చూపిస్తాయి. అందుకే మనలో చాలామంది జంతువులు, పక్షులను పెంచుతుంటారు. వాటితో అనుబంధాన్ని ఏర్పరుచుకుంటారు. ఆ మూగజీవులతో మమేకమవుతారు. కుటుంబ సభ్యులతో సమానంగా ఆదరిస్తారు. వాటికేమైనా జరిగితే విలవిల్లాడిపోతారు. తిరుపతిలో ఎక్కువ మంది ఇంట్లో కుక్కలను పెంచుతున్నారు. కుందేళ్లు, ఎలుకలు, పిల్లులే కాదు పలు రకాలు పక్షులనూ సాకుతున్నారు. ఒకరైతే గుర్రాన్ని పెంచుతూ ప్రేమను వ్యక్తం చేస్తున్నారు. వారిలో కొందరిని ఒకసారి పలుకరిస్తే

- తిరుపతి(ఆంధ్రజ్యోతి)



ఆ పది గుర్రాలే నా లోకం

ఆశ్వాలే నా లోకం. నా దగ్గర మార్వాడీ జాతికి చెందిన పది గుర్రాలున్నాయి. ఏడాది వయసున్నప్పుడు రాజస్థాన్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి తీసుకువచ్చి పెంచుతున్నాను. ఒకపక్క బిజినెస్ పనులు చేసుకుంటూ గుర్రాలను చూసుకుంటున్నాను. ఒక్కో గుర్రానికి నెలకు రూ20వేలు ఖర్చవుతుంది. భారంగా భావించను. భవిష్యత్తులో గుర్రాలపై పిల్లలకు అవగాహన కల్పించాలనుకుంటున్నాను.



- కార్తీక్, బైరాగిపట్టెడ(తిరుపతి)



పక్షులంటే ప్రాణం

నాకు పక్షులు, కుందేళ్లను పెంచడమంటే ఇష్టం. నా దగ్గర నాలుగు రకాల జాతుల పక్షులు(8 జతలు) ఉన్నాయి. నాలుగు జతల కుందేళ్ళున్నాయి. అమాయకంగా అందంగా కనిపించే వీటిని చూస్తే అప్పటివరకు పడిన కష్టాన్ని మర్చిపోతాను. 15 ఏళ్లుగా పెంచుతున్నాను. వీటితో గడపడమంలో చాలా ఆనందాన్ని పొందుతాను. ఒత్తిడి దూరమవుతుంది..

- దుర్గాప్రసాద్, అవిలాల (తిరుపతి)

నాకోసం ఎదురు చూస్తాయి

చిన్నప్పటి నుంచి శునకాలంటే మహా ఇష్టం. ఇంట్లో నాలుగింటిని పెంచుకుంటున్నా. నెల జీతంలో వీటి సంరక్షణకు రూ8వేలు ఖర్చవుతుంది. వాటికి ఇష్టమైన ఆహారం పెట్టి సంతోషడతాను. అనారోగ్యం బారిన పడకుండా ఎప్పటికప్పుడు మందులు వాడుతున్నాను. రోజూ వాటి అవసరాలు చూసుకొని డ్యూటీకి వెళతాను. సాయంత్రం అవి ఎంతో ప్రేమగా నాకోసం ఎదురుచూస్తుంటాయి. దీంతో కష్టాన్ని మరిచిపోతుంటాను.

- శివ, కరకంబాడి(తిరుపతి)

ఆరోగ్యం విషయంలో శ్రద్ధ



తిరుపతిలో 700 మందికి పైగా పెట్ లవర్స్ ఉన్నారు. అన్ని జాతుల కుక్కలను పెంచకుంటున్నారు. పిల్లులు, కుందేళ్లను పెంచడం తక్కువ. పెట్స్‌కు టీకాల విషయంలో శ్రద్ధ అవసరం. ఎప్పుడు వేయాలో షెడ్యూల్ చేసుకోవాలి. వాటికి అనుగుణమైన ఆహారం ఇవ్వాలి. విశ్రాంతి పొందేలా సురక్షిత ప్రదేశంలో ఉంచాలి. అవి ఫ్రెండ్లీగా, కుటుంబసభ్యులుగా మారిపోతాయి.

- డాక్టర్ నాగేంద్ర, వెటర్నరీ అధికారి, ఎంసీటీ







పెట్స్ అవసరాలు తీర్చే షాపులు పెరిగాయి

పెట్స్ హాబీ పెరిగేకొద్దీ నగరంలో వాటి అవసరాలకు అనుగుణంగా షాపులు పెరిగాయి. ముఖ్యంగా ఆహారం, మందుల షాపులు వచ్చాయి. 1991లో తిరుపతిలో వెట్‌పార్మా ప్రారంభించాను. తిరుపతిలో 14 నుంచి 15వేల పెట్స్ ఉన్నాయి. కరోనా సమయంలో వీటి సంఖ్య బాగా పెరిగింది. ఆహారానికి సంబంధించి విదేశీ ఉత్పత్తులు కూడా అందుబాటులో ఉన్నాయి. మందులతో పాటు బెల్టులు లాంటి యాక్ససరీస్‌లకు డిమాండు ఉంది.

- ఎం.శ్రీనివాసరావు, వెట్ ఫార్మా ఏజెన్సీస్, తిరుపతి



ప్రత్యేక షాపుల్లో పెట్స్ కోసం ఆటవస్తువులు, స్నాక్స్, తదితరాలు

కలికిరిలో 15న దేశవాళీ విత్తనాల పరిరక్షణ సదస్సు

● హాజరుకానున్న రాయలసీమ రైతులు

కలికిరి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): దేశవాళీ వంగడాలను పరిరక్షించి, అవసరమైతే బహుళ ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి కేంద్ర వ్యవసాయ శాఖ సన్నాహాలు ప్రారంభించింది. రాయలసీమ జిల్లాల్లో దాదాపు ముప్పై, నలభై ఏళ్ళ క్రితం వాడుకలో ఉన్న వరి, వేరుశెనగ, ఉద్యాన పంటలు, పశుగ్రాసం తదితర సంప్రదాయ వంగడాల విత్తనాలను సమీకరించి పరిరక్షించే బాధ్యతలను కలికిరి కృషి విజ్ఞాన కేంద్రానికి అప్పగించింది. ఇందులో భాగంగా ఈ నెల 15న అన్నమయ్య జిల్లా కలికిరిలో రాయలసీమ స్థాయి దేశవాళీ వంగడాలు సాగుచేస్తున్న రైతుల సదస్సు ఏర్పాటు చేసినట్లు కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ మంజుల తెలిపారు. రాయలసీమలోని చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, కడప, నంద్యాల, సత్యసాయి, అనంతపురం జిల్లాల్లోని దేశవాళీ రకాలను కాపాడుకొస్తున్న రైతులు, రైతు సంఘాలతో ఈ సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు కోఆర్డినేటర్ వివరించారు. రైతులు తరతరాలుగా కాపాడుకొస్తున్న దేశవాళీ ఆహార ధాన్యాలు, ఉద్యాన పంటలు (పూలతో సహా), పశుగ్రాసానికి సంబంధించిన విత్తనాలను ఈ సదస్సులో ప్రదర్శించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ జిల్లాల్లోని రైతులు తాము ప్రదర్శించబోయే రకాల గురించి ముందుగానే సమాచారం అందజేసి, పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. దేశవాళీ రకాలను సంరక్షిస్తున్న రైతులకు వివిధ రకాల లబ్ధి చేకూరేందుకు ఈ సదస్సు ద్వారా అవకాశం కలుగుతుందని తెలిపారు. పేర్లు నమోదుకు, లేదా ఇతర వివరాల కోసం కేవీకే కోఆర్డినేటర్‌ను 8008500320 లేదా 9618934777 నంబర్లలోనూ లేదా కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ నవీన (పశువైద్య విభాగం 9502888728), డాక్టర్ పీరూసాహెబ్ (సస్యరక్షణ 7989850004), డాక్టర్ ఎ.శ్రీనివాసులు (ఉద్యాన విభాగం 8008724284), డాక్టర్ మాధురి (విస్తరణ విభాగం 6303197399), డాక్టర్ ఎస్.సోమశేఖర్‌బాబు (సేద్య విభాగం 9440500167)లను సంప్రదించాలని కోరారు.

నేడు, రేపు తుంబురతీర్థ ముక్కోటి

● ఉదయం 5 నుంచి 10 గంటల వరకే అనుమతి

తిరుమల, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శుక్ర, శనివారాల్లో తుంబుర తీర్థ ముక్కోటి జరుగనుంది. ఈ రెండు రోజులూ తీర్థానికి ఉదయం 5 నుంచి 10 గంటల వరకు భక్తులను అనుమతిస్తారు. భక్తులకు టీటీడీ పాపవినాశనం డ్యాం వద్ద అన్నప్రసాదాలు, తాగునీరు అందజేయనుంది. ప్రథమ చికిత్స కేంద్రాలు, వైద్యులు, మందులను కూడా అందుబాటులో ఉంచనున్నారు. ఎక్కువ దూరం నడవాల్సి ఉండటంతో 60 ఏళ్ల పైబడిన వృద్ధులు, గుండె, శ్వాసకోశ సమస్యలు, స్థూలకాయం ఉన్నవారికి అనుమతిలేదని టీటీడీ స్పష్టం చేసింది. ఏర్పాట్లపై టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి సమీక్షించారు. ముక్కోటి రోజుల్లో గోగర్భం డ్యాం సర్కిల్ నుంచి పాపవినాశనం డ్యాం వరకు ఆర్టీసీ బస్సులను మాత్రమే అనుమతిస్తారు. ప్రైవేట్ వాహనాలకు అనుమతిలేదని టీటీడీ ప్రకటించింది.

నిఖిత మృతిపై పోలీసుల దర్యాప్తు వేగవంతం

చంద్రగిరి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నరసింగాపురంలో యువతి అనుమానాస్పద మృతిపై పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. గ్రామానికి చెందిన నిఖిత(17) ఈనెల 4న మృతి చెందడం, ఆగమేఘాలపై కుటుంబ సభ్యులు దహనక్రియలు నిర్వహించడం తెలిసిందే. ఇది పరువు హత్యగా వెలుగులోకి రావడంతో గురువారం మృతురాలి ఎముకలను ఫోరెనిక్స్ బృందం సేకరించింది. ల్యాబ్‌కు పంపింది. ఘటన జరిగిన రోజున మృతురాలి తల్లి సుజాత ఉనికిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. కుటుంబ సభ్యులు తనకు విషం పెట్టి చంపేద్దామనికుంటుంటే విన్నానని నిఖిత తన ప్రియుడి అజయ్‌కు వాట్సప్ ద్వారా మెసేజి పంపినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుంది.

మెగా డీఎస్సీ పరీక్షకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : ఏపీబీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ పరీక్ష కోసం ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి రాజేంద్రకుమార్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టెట్ పరీక్షల్లో అర్హత సాధించిన తిరుపతి జిల్లావాసులకు మాత్రమే ఈ అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. టెట్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక ఉంటుందని, మరిన్ని వివరాలకు 9441456039ను సంప్రదించాలని కోరారు.

జాతీయ స్థాయికి 'మినీ ఫాస్ట్ కంపోస్టర్'

● తడుకు విద్యార్థుల ప్రతిభ



జేసీ, డీఈవో, జిల్లా సైన్స్ అధికారితో తో తడుకు విద్యార్థులు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వడమాలపేట మండలం తడుకు (ఆర్ఎస్) జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన 'మినీ ఫాస్ట్ కంపోస్టర్' జాతీయ స్థాయిలో ఎంపికైంది. జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్ మార్గనిర్దేశంలో విద్యార్థులు హేమశ్రీ, గీతిక, వినయ్ కుమార్ ఈ ప్రాజెక్టును తయారు చేశారు. వికసిత భారత్- 2047లో భాగంగా సహజ సమస్యలకు వినూత్న పరిష్కారాలను గుర్తించి, వాటిని అభివృద్ధి చేసేందుకు విద్యార్థులను ప్రోత్సహించే లక్ష్యంతో కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ, అటల్ ఇన్నోవేషన్ మిషన్, నీతి ఆయోగ్, మౌళిక విద్యా మంత్రిత్వ శాఖ, ఆలిండియా కౌన్సిల్‌ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సంయుక్తంగా స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ (ఎస్ఐఎం) పోటీలకు శ్రీకారం చుట్టాయి. 2024 జూలై 29న పోటీలు ప్రారంభంకాగా లక్షలకు పైగా ప్రాజెక్టులు కేంద్ర విద్యామంత్రిత్వ శాఖకు అందాయి. వీటిని ఐదు దశల్లో వడపోసి పలు రాష్ట్రాలకు చెందిన 100 ప్రాజెక్టులు ఎంపిక చేశారు. అందులో మన రాష్ట్రం నుంచి రెండు ఉండగా.. అందులో ఒకటి తడుకు విద్యార్థులు రూపొందించిన మినీ ఫాస్ట్ కంపోస్టర్. ఈ ప్రాజెక్టుకు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ రూ. 90,500 అందించింది. ఈ మొత్తంతో ఈ పరికరాన్ని వ్యాపార పరంగా వినియోగించేలా అభివృద్ధి చేయనున్నారు.

పరికరం.. ఉపయోగాలు

మినీ ఫాస్ట్ కంపోస్టర్ ద్వారా వంటగది వ్యర్థాలు, పండ్లు, కూరగాయల తొక్కలు, కుళ్లిన ఆహారం, కూరగాయలను సేంద్రియ ఎరువు తయారు చేయొచ్చు. ఏరోబిక్ కంపోస్ట్ పద్ధతిలో బ్యాక్టీరియాను వృద్ధి చెందించి వ్యర్థాలను సేంద్రియ ఎరువుగా మారుస్తుంది. వ్యర్థాలను బ్యాక్టీరియా విచ్ఛిన్నం చేయడానికి అవసరమైన ఉష్ణోగ్రతను విద్యుత్‌తో పనిలేకుండా సోలార్ ప్యానెల్స్ ద్వారా సమకూరుతుంది. ఈ మినీ ఫాస్ట్ కంపోస్టర్ పరికరాన్ని రూపొందించిన విద్యార్థులు హేమశ్రీ, గీతిక, వినయ్‌కుమార్ గురువారం డీఈవో కేవీఎన్ కుమార్, జిల్లా సైన్సు అధికారి భానుప్రసాద్‌తో కలిసి కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌ను కలిశారు. ఆయన విద్యార్థులను, విద్యాశాఖ అధికారులను అభినందించారు.

అమ్మవారికి కానుకగా బంగారు పట్టీలు





తిరుచానూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారికి కడప జిల్లాకు చెందిన డాక్టర్ రామస్వామి ఏలుమలై రెడ్డి దంపతులు రూ.10 లక్షల విలువైన 120 గ్రాముల బంగారు గజ్జెల(పట్టీలు)ను కానుకగా అందజేశారు. గురువారం ఆలయంలో ఏఈవో దేవరాజులుకు వాటిని అందజేశారు. దాతలకు అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేశారు. అర్చకులు బాబు స్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ చలపతి పాల్గొన్నారు.

తిరుమలలో డిప్యూటీ స్పీకర్



తిరుమల/రేణిగుంట, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): శాసన సభ డిప్యూటీ స్పీకర్ రఘు రామ కృష్ణరాజు గురువారం తిరుమలకు వచ్చారు. గాయత్రి అతిథిగృహానికి చేరుకున్న ఆయనకు టీటీడీ రిసెప్షన్ ఓఎస్డీ సత్రేనాయక్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. రఘురామ కృష్ణరాజు శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు. కాగా, గురువారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆయన మీడియాతో మాట్లాడారు. తన కుమారుడి జన్మదినం సందర్భంగా శ్రీవారి దర్శనానికి వచ్చానన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుమారుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తన కేసులో విచారణ ఎదుర్కొంటున్న డాక్టర్ ప్రభావతమ్మకు జ్ఞాపక శక్తిని ప్రసాదించాలని శ్రీవారిని ప్రార్థిస్తానని వ్యంగంగా అన్నారు.

అర్ధరాత్రి మారణాయుధాలతో హల్‌చల్

● ప్రత్యర్థులు తప్పించుకోవంతో ఇంటి నిర్మాణ గోడలను కూల్చివేసిన వైనం ● ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయని పోలీసులు



ఇంటి నిర్మాణ గోడలను కూల్చివేసిన దృశ్యం

సూళ్లూరుపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలం కొరిడి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మారణాయుధాలతో పక్కింట్లో ఉంటున్న దంపతులపై దాడికి ప్రయత్నించగా, వారు తప్పించుకుని పారిపోయారు. దీంతో బాధితులు కొత్తగా నిర్మించుకుంటున్న ఇంటి గోడలను కూల్చివేసిన ఘటన బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకొంది. స్థానికుల సమాచారం మేరకు... కొరిడి దళితవాడకు చెందిన కిలివేటి మణి, కిష్టమ్మ కొత్తగా ఇంటిని నిర్మించుకుంటున్నారు. వారింటి పక్కనే నివాసం ఉంటున్న కిలివేటి రవిచంద్ర బుధవారం రాత్రి 11 గంటల సమయంలో కత్తి, గడ్డపారతో మణి ఇంటికెళ్లి నీ భర్త ఎక్కడంటూ కిష్టమ్మ ప్రశ్నిస్తూ హల్‌చల్ చేశాడు. ఒంటరిగా ఉన్న కిష్టమ్మ భయంతో భర్తకు ఫోన్ చేయడంతో మణి ఇంటి వద్దకు చేరుకోగా రవిచంద్ర దాడికి ప్రయత్నించాడు. దీంతో మణి, ఆయన భార్య కిష్టమ్మ తప్పించుకుని పారిపోయారు. దీంతో వారు కొత్తగా నిర్మిస్తున్న ఇంటి గోడలను రవిచంద్ర కూల్చివేశాడు. రాత్రి సమయం కావడం, చేతిలో కత్తి, గడ్డపార ఉండడంతో ఇరుగుపొరుగువారు భయంతో మిన్నకుండిపోయారు. ఘటన జరిగిన అనంతరం బాధితులు శ్రీహరికోట పోలీసులకు సమాచారం అందించారు. గురువారం పోలీసులు కొరిడి గ్రామానికి వెళ్లి కూల్చివేసిన ఇంటిని పరిశీలించారు. జరిగిన ఘటనపై కిష్టమ్మ శ్రీహరికోట పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే బాధితులు, నిందితుడు బంధువులు పిలిపించి విచారిస్తామని పోలీసులు చెప్పారు.

రేపు మాజీ ఉపరాష్ట్రపతి తిరుపతి పర్యటన

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు శనివారం నుంచి రెండు రోజులపాటు తిరుపతి పర్యటనకు విచ్చేయనున్నారు. శనివారం ఉదయం 10గంటలకు తిరుపతి నగరంలోని కచ్చపి ఆడిటోరియంలో జరిగే 'ఒక దేశం- ఒక ఎన్నిక' సెమినార్‌లో ప్రసంగించనున్నారు. సాయంత్రం 5 గంటలకు జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో హాస్టల్ బిల్డింగ్ నూతన కార్యాలయాన్ని ప్రారంభించి అనంతరం 6 గంటలకు జాతీయ సంస్కృత విద్యాలయంలో జరిగే గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ సంస్మరణ సభలో పాల్గొంటారు. ఆదివారం ఉదయం 8.20గంటలకు హైదరాబాద్‌కు తిరుగు పయనం కానున్నారు.

తిరుపతి నుంచి కడప జిల్లాకు వెళ్లే వాహనాల మళ్లింపు

రాయచోటి మీదుగా నడపాలని ఆదేశం

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ఒంటిమిట్ట సీతారాముల కల్యాణానికి సీఎం చంద్రబాబు వస్తున్న కారణంగా తిరుపతి నుంచి వెళ్లే అన్ని వాహనాలను దారి మళ్లించారు. భాకరాపేట, పీలేరు, రాయచోటి మీదుగా నడపాలని ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశాలు జారీ చేశారు. కడప నుంచి తిరుపతికి పీలేరు, భాకరాపేట మీదుగా రావాల్సి ఉంటుందని తెలిపారు. 11వ తేదీ రాత్రి 9 నుంచి 12వ తేదీ ఉదయం 9 గంటల వరకు ఇది అమల్లో ఉంటుందని పేర్కొన్నారు.

17న ఆర్థిక కమిషన్ రాక

తిరుపతి(కలెక్టరేట్),ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): 16వ ఆర్థిక కమిషన్ ఈ నెల 17, 18 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కమిషన్ పర్యటన ఏర్పాట్లపై జేసీ శుభం బన్సల్‌తో కలిసి ఆయన గురువారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఏర్పాట్లు, ప్రోటోకాల్, బందోబస్తు పగడ్బందీగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, డీఆర్వో నరసింహులు, జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు, సీపీవో ప్రేమ్‌చంద్ పాల్గొన్నారు.




పుంగనూరు జాతి దూడలను ఆసక్తిగా తిలకిస్తున్న మధ్యప్రదేశ్ పశుసంవర్ధక మంత్రి లకాణ్ పటేల్ - ఆవుల పెంపక కేంద్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి లకాణ్ పటేల్, ఆ రాష్ట్ర అధికారులు

పుంగనూరు జాతి పశువులది ప్రత్యేక స్థానం

మధ్యప్రదేశ్ పశుసంవర్ధక శాఖ మంత్రి లకాణ్ పటేల్

గంగవరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే పుంగనూరు జాతి పశువులకు ప్రత్యేక స్థానం ఉందని.. అలాంటి అరుదైన పుంగనూరు జాతి ఆవుల ఉత్పత్తి, పెంపక కేంద్రం పలమనేరులో ఉండటం ఇక్కడి వారికి గర్వకారణమని మధ్యప్రదేశ్ పశు సంవర్ధక శాఖ మంత్రి లకాణ్ పటేల్ పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లో పుంగనూరు జాతి ఆవులను అభివృద్ధి చేయడానికి పలమనేరు సమీపంలోని పరిశోధనా కేంద్రాన్ని మంత్రితో పాటు ఆ రాష్ట్ర అధికారులు పరిశీలించారు. పుంగనూరు జాతి ఆవుల బ్రీడ్‌ను ఉత్పత్తి చేయడానికి ఏర్పాటు చేసిన ల్యాబ్, పుంగనూరు జాతి ఆవుల పెంపకం విధానం, ఆవుల సంరక్షణపై ప్రత్యేకంగా పరిశీలించి వివరాలను సేకరించారు. పుంగనూరు జాతి పశువుల పాలకు ఉన్న పోషక విలువలపై అడిగి తెలుసుకున్నారు. పుంగనూరు జాతి పశువుల మనుగడను కాపాడుతూ అత్యాధునిక టెక్నాలజీని వినియోగించడం చాలా బాగుందని కొనియాడారు. ఇలాంటి అరుదైన పశు జాతి దేశంలోనే చిత్తూరు జిల్లాలో ఉండటం సంతోషకరమన్నారు. పుంగనూరు జాతి పశువుల ఉత్పత్తిని తమ రాష్ట్రంలో పెంపొందిస్తామని.. పుంగనూరు జాతి బ్రీడ్ ఉత్పత్తిపై దృష్టి సారిస్తామన్నారు. కార్యక్రమంలో తిరుపతి వెటర్నరీ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ లత, పశుసంవర్ధకశాఖ జేడీ ఆరీఫ్,ఏడీ సుజాత, పలువురు అధికారులు పాల్గొన్నారు.

మారుమూల గ్రామాల్లోనూ
క్రీడా మైదానాలు

తిరుపతిలో స్పోర్ట్స్ అకాడమి

ఏపీ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు శివనాథ్



తిరుపతి(క్రీడలు), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి గ్రామంలోనూ క్రీడా మైదానాలు ఏర్పాటు చేయనున్నట్లు ఏపీ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ ఆహ్వానం మేరకు ఆయన జీవకోన మార్గంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో యువ క్రికెటర్లతో సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ క్రీడాంధ్రప్రదేశ్‌గా రాష్ట్రం ముందుకెళ్లాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. మారుమూల ప్రాంతంలోనూ క్రికెట్ అభివృద్ధి చెందాలని, తద్వారా పెడదారిపట్టిన యువత దారిలో పడుతుందని అన్నారు. ఇందులో భాగంగా క్లీన్ క్రికెట్ అండ్ రూరల్ క్రికెట్ అనే నినాదంతో ముందుకు వెళుతున్నామని చెప్పారు. శాప్, క్రికెట్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో క్రీడా మైదానాలు ఏర్పాటు చేస్తామన్నారు. వచ్చే రెండేళ్లలో ఆంధ్రా తరఫున క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి, ఇండియన్ ప్రీమియర్‌లీగ్‌లో ప్రాతినిథ్యం వహించేలా మౌలిక సదుపాయాలు సమకూరుస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా త్వరలో మూడు అకాడమీలు రానున్నాయన్నారు. వాటి ద్వారా ఆంధ్రా ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లకు ప్లాన్ చేస్తున్నామన్నారు. తిరుపతిలో స్పోర్ట్స్ అకాడమి ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. అమరావతిలో మంచి స్పోర్ట్స్ సిటీ నిర్మించాలని భావిస్తున్నామన్నారు.

13న గురుకుల ప్రవేశ పరీక్షలు

రామకుప్పం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని తిమ్మసముద్రం వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో 2025-2026 విద్యా సంవత్సరానికి గాను ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 13న విద్యాలయంలో ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజేంద్ర తెలిపారు. ఐదో తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ప్రవేశ పరీక్షలు జరుగుతాయని ఆయన తెలిపారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తోపాటు ఆధార్‌కార్డు లాంటి ఏదేని గుర్తింపు కార్డు తమ వెంట తీసుకురావాలని ఆయన కోరారు.

వీధికుక్కల దాడితో లేగదూడల మృతి

సోమల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుంగావారిపల్లెలో వీధికుక్కలు దాడి చేసి ఆరు లేగ దూడలు మృత్యువాత పడినట్లు బాధిత రైతులు తెలిపారు. అడుసుపల్లె, బుంగావారిపల్లెల్లో పాడి రైతులు అధికంగా ఉన్నారు. తమ లేగ దూడలను ఇంటి వద్ద పాకల్లో వదిలి పశువులను మేతకు పొలాల వద్దకు తీసుకెళుతుంటారు. ఈక్రమంలోనే లేగ దూడలపై వీధికుక్కలు దాడుల చేసి తీవ్రంగా గాయపరుస్తున్నాయి. గత రెండు రోజుల్లో రాంబాబుకు చెందిన రెండు లేగదూడలు, దేవేంద్రకు చెందిన ఓ దూడ, హరి, నాగ మల్లయ్యలకు చెందిన లేగ దూడలు మృత్యువాత పడ్డాయని రైతులు వాపోయారు. వీధి కుక్కల బెడద నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

14న చిత్తూరు జిల్లా సబ్ జూనియర్ షూటింగ్ బాల్ జట్టు ఎంపిక



కుప్పంలో సమావేశమైన షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రతినిధులు

కుప్పం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రామకుప్పంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఈనెల 14న ఉదయం 10 గంటలకు చిత్తూరు జిల్లా సబ్ జూనియర్ బాలురు, బాలికల షూటింగ్ బాల్ జట్లను ఎంపిక చేయనున్నట్లు షూటింగ్ బాల్ జిల్లా చైర్మన్ మహేష్, ప్రెసిడెంట్ పవన్ కల్యాణ్, వైస్ ప్రెసిడెంట్ లోకనాథం, సెక్రటరీ వేణుగోపాల్, జాయింట్ సెక్రటరీ జబీర్, స్వాతి, సభ్యులు వేణు, సబిత తెలిపారు. కుప్పంలో వీరు గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్కడ ఎంపికైన జట్లను ఈనెల 26, 27వ తేదీలలో మదనపల్లెలో జరుగబోయే అంతర్ జిల్లా పోటీలకు పంపిస్తామన్నారు. ఎంపికకు వచ్చే విద్యార్థులు 2008 ఏప్రిల్ ఒకటో తేదీ తర్వాత జన్మించినవారై ఉండాలన్నారు. తమవెంట తప్పనిసరిగా ఆధార్ కార్డు తీసుకు రావాలని చెప్పారు. వివరాలకు ఫోన్‌నంబర్లు 6301831236, 9618330565 లను సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి శుకబ్రహ్మాశ్రమ వార్షికోత్సవాలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శుకబ్రహ్మాశ్రమంలో శుక్రవారం నుంచి 15వ తేదీ వరకు విద్యాప్రకాశానందగిరి 27వ పుణ్యారాధన, 112వ జయంత్యుత్సవం, 75వ ఆశ్రమ వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నట్లు పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరిస్వామి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 11న గురుదేవుల అధిష్ఠాన మందిరంలో శ్రీవారికి అభిషేకం, అర్చన, 12న ఆశ్రమ వార్షికోత్సవం, ఎస్వీఏ కళాశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం, 13న త్రినేత్ర వైద్యాలయ వార్షికోత్సవం, కంటి అద్దాల ప్రదానం, వైద్యులకు సన్మానం, 14న సద్గురు సర్వసేవా ట్రస్టు వార్షికోత్సవం, యోగాసనాల సర్టిఫికెట్ల ప్రదానం, 15న విద్యాప్రకాశనందగిరి 112వ జయంత్యుత్సవం, పాదుకపూజ జరుగుతుందని తెలిపారు.

సప్తగిరికి ఎమ్మెల్యేల పరామర్శ



సప్తగిరిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యేలు నాని, మురళీమోహన్

తిరుపతి రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం ఓటేరు పంచాయతీకి చెందిన సినీ నటుడు సప్తగిరిని గురువారం చంద్రగిరి, పూతలపట్టు ఎమ్మెల్యేలు పులివర్తి నాని, మురళీ మోహన్ పరామర్శించారు. రెండ్రోజుల క్రితం సప్తగిరి తల్లి చిట్టెమ్మ అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలిసిందే. గురువారం శ్రీనివాసపురంలోని ఆయన నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యేలు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు

ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ ఆదేశించారు. గురువారం చిత్తూరు రూరల్ డివిజన్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఎండలు పెరగడంతో విద్యుత్ వినియోగం పెరిగిందన్నారు. ఈ కారణంగా లోడ్ పెరిగి ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురవుతాయన్నారు. వాటిని స్థానంలో లోడ్ అధికంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఈఈ సురేష్, డీఈ శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

మే 17న వన్నియకుల క్షత్రియ మహాసభ

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): చెన్నై సమీపంలోని మహాబలిపురంలో మే 17వ తేదీన వన్నియ కులక్షత్రియ మహాసభ జరగనుందని ఆ కుల సంఘం నేతలు తెలిపారు. చిత్తూరులోని జిల్లా టీడీపీ కార్యాలయంలో గురువారం సభ ప్రచార పోస్టర్‌ను విడుదల చేశారు. తమిళనాడు మాజీ ఎమ్మెల్యే ధనశేఖర్, గణేశన్ తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ పరీక్షకు ఉచిత కోచింగ్

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులకు మెగా డీఎస్సీ పరీక్షకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ ఇవ్వనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు టెట్ అర్హత కలిగి ఉండాలన్నారు. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తులను జిల్లా వెనుకబడిన సంక్షేమం, సాధికారిత అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. వివరాలకు 91774 29494 నెంబరును సంప్రదించాలని కోరారు.

ఎంపీ కృషితోనే 'తిరుపతి-కాట్పాడి'
డబుల్ రైల్వే లైన్ మంజూరు

కూటమి నాయకుల హర్షం



మీడియాతో మాట్లాడుతున్న కూటమి పార్టీల నాయకులు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు కృషితోనే తిరుపతి-కాట్పాడి మధ్య డబుల్ రైల్వే లైన్ మంజూరైందని కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం జిల్లా టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, ప్రధానకార్యదర్శి కోదండయాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్ నాయుడు, ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు మీడియాతో మాట్లాడారు. వారు మాట్లాడుతూ డబుల్ రైల్వేలైన్ ఏర్పాటుకు కృషిచేస్తామని ఎన్నికల సందర్భంగా ఎంపీ ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని చెప్పారు. డబుల్ లైన్ వల్ల గతంలో ఆగని ఎక్స్‌ప్రెస్ రైళ్లు కూడా చిత్తూరులో ఆగనున్నాయని తెలిపారు. అంతేకాక తిరుపతి, తిరుచానూరు, శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్‌టెంపుల్ వంటి ప్రముఖ ఆలయాలను సందర్శించే భక్తులకు సౌకర్యంగా ఉంటుందని అన్నారు. పర్యాటకుల రాకపోకలతో చిత్తూరు అభివృద్ధి చెందుతుందన్నారు. తమిళనాడు మాజీ ఎమ్మెల్యే ధనశేఖర్, గణేషన్, క్లస్టర్ ఇన్‌చార్జి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత ఒక ప్రకటనలో ఎంపీకి అభినందనలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించలేని సమావేశాలెందుకు?

గంగవరం మండలమీట్‌లో ఎంపీడీవోపై మండిపడ్డ ప్రజాప్రతినిధులు



ఎంపీడీవోను నిలదీస్తున్న సర్పంచులు, ఎంపీటీసీలు

గంగవరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులకు కనీస సమాచారం ఇవ్వకుండా గ్రామాల్లో అభివృద్ధికి సహకరించని ఎంపీడీవో తమకెందుకని ఎంపీపీ, జడ్పీటీసీ, సర్పంచులతో పాటు ఎంపీటీసీలు నిలదీశారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ వెంకటరమణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశం ప్రారంభంలోనే గత రెండు సమావేశాల్లో లేవనెత్తిన సమస్యలు పరిష్కరించలేదని.. సమస్యలు పరిష్కరించలేని సమావేశం ఎందుకని మండిపడ్డారు. మంజూరైన 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.76 లక్షలను పక్కదారి పట్టించారని, ఆ నిధుల లెక్కలు తేల్చండంటూ సర్పంచులు భాస్కర్‌రెడ్డి, గిరిరాజారెడ్డి నిలదీశారు. ప్రతి ఎంపీటీసీకి రూ.3 లక్షల నిధులు కేటాయించి మౌలిక వసతుల కల్పనకు సహకరించాలని గతంలో జడ్పీ సీఈవో ఆదేశించినా ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. గ్రామాల్లో తాగునీరు, మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. నిధులు ఖర్చు చేసుంటే ఆ బిల్లుల వివరాలు సభకు తెలపాలని పట్టుబట్టడంతో తాను అభివృద్ధి పనులకు మాత్రమే నిధులు ఖర్చుచేశానని సమాధానమిస్తూ ఎంపీడీవో మైక్ పెట్టేశారు. ఎంపీడీవో ఇప్పటికైనా తీరు మార్చుకోవాలని .. లేని పక్షంలో ప్రజలే తిరగబడే స్థాయికి తెచ్చుకోవద్దని హితవు పలికారు. అనంతరం శాఖల వారీగా అమలవుతున్న సంక్షేమ ఫలాలు, పథకాల వివరాలను ఆయా శాఖల అధికారులు వివరించారు.

కమనీయం ముక్కంటి ఆలయ
విహంగ వీక్షణం





శ్రీకాళహస్తి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ విహంగ వీక్షణం చూపరులను కమనీయంగా అబ్బుర పరుస్తోంది. ప్రసిద్ధ శైవక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయ పైకప్పు దెబ్బతినడంతో లీకేజీలు ఏర్పడిన విషయం తెలిసిందే. పురావస్తు శాఖ డైరెక్టర్ మునిరత్నంరెడ్డి సూచనలతో పూణేకు చెందిన భక్తుడు వెంకీ హేచరీస్ సంస్థ అధినేత వెంకటేశ్వరరావు రూ.5కోట్ల నిధులతో స్వచ్ఛందంగా ముక్కంటి ఆలయ పైకప్పు మరమ్మతు పనులను చేపట్టిన విషయం విదితమే. అత్యంత శాస్త్రీయ విధానంతో సంస్థ పైకప్పు లీకేజీ పనులను పూర్తిచేశారు. దీంతో ఆలయ పైభాగం ఎంతో సుందరంగా ముస్తాబైంది. తాజాగా పైకప్పు ఆకర్షణీయంగా కనిపిస్తోంది. భక్తకన్నప్ప కొండపై నుంచి ముక్కంటి ఆలయ విహంగ వీక్షణ దృశ్యం భక్తులకు ఆవిష్కృతమవుతోంది.




అలరించిన దుర్యోధన వధ

కల్లూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరులోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న మహాభారత యజ్ఞంలో భాగంగా చివరిరోజు గురువారం దుర్యోధన వధ ఘట్టం అట్టహాసంగా జరిగింది. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో బంకమట్టితో దుర్యోధనుడి బొమ్మను రూపొందించి పూజలు చేపట్టారు. దుర్యోధనుడిని భీమసేనుడు మడుగు నుంచి బయటకు రప్పించే సన్నివేశం ఆకట్టుకుంది. దుర్యోధనుడు, భీమసేనుల మధ్య యుద్ధ సన్నివేశాలు, పద్యాలు, పాటలు రక్తి కట్టించాయి. భీమసేనుడు దుర్యోధనుడి తొడపై గదతో కొట్టి వధించి అతడి రక్తాన్ని ద్రౌపదీదేవి కురులకు పూసే సన్నివేశాలకు పాత్రధారులు జీవంపోశారు. దుర్యోధనుడి వధను వీక్షించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సాయంత్రం ధర్మరాజు పట్టాభిషేకం నిర్వహించారు. రాత్రి భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం చేశారు.

గోకులం షెడ్ల బిల్లుల చెల్లింపులో జాప్యం

పేరుకుపోయిన బకాయిలు



వెదురుకుప్పం మండలం చవనపల్లెలో నిర్మించిన గోకులం షెడ్డు

వెదురుకుప్పం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు చేయూతగా గోకులం షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.ఉపాధి హామీ పథకం నిధులతో ఈ పనులు చేపట్టారు. పనులు పూర్తయి నెలలు గడుస్తున్నా బిల్లులు అందకపోవడంతో పాడి రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాకు 2173 గోకులం షెడ్లు మంజూరు కాగా 2094 షెడ్ల నిర్మాణాలకు పనులు ప్రారంభమయ్యాయి. 1393 షెడ్ల పనులను పూర్తి చేశారు. ఇంకా వివిధ దశల్లో 701 షెడ్లు ఉండగా ఇప్పటికీ 79 గోకులం షెడ్ల నిర్మాణ పనులను మొదలు పెట్టలేదు.గంగాధరనెల్లూరు నియోజకవర్గం విషయానికి వస్తే వెదురుకుప్పం మండలానికి 33 షెడ్లు మంజూరు కాగా 30 షెడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి.ఒక షెడ్డు పనులు మాత్రం మొదలుపెట్టలేదు.పాలసముద్రం మండలానికి 39 షెడ్లు మంజూరు కాగా 27 షెడ్ల పనులు పూర్తి చేశారు. ఇప్పటికీ రెండు షెడ్లనిర్మాణ పనులు మొదలుపెట్టలేదు.కార్వేటినగరం మండలానికి 51 షెడ్లు మంజూరైతే 33 షెడ్ల నిర్మాణ పనులను పాడి రైతులు పూర్తి చేశారు. ఇప్పటికీ నాల్గు షెడ్ల పనులను మొదలుపెట్టలేదు.గంగాధరనెల్లూరు మండల పరిధిలో 50 గోకులం షెడ్లు మంజూరు చేశారు. వీటిలో 35 పూర్తి చేశారు. మూడు షెడ్ల నిర్మాణపనులను మొదలు పెట్టలేదు.ఎస్ఆర్‌పురం మండలంలో 65 గోకులం షెడ్లుమంజూరయ్యాయి. వీటిలో 32 షెడ్ల పనులను పూర్తి చేశారు. ఇప్పటికీ మూడు షెడ్ల పనులను చేపట్టలేదు.

పది శాతం రైతులు చెల్లించాలి

గోకులం షెడ్డు నిర్మాణ నిధుల్లో పది శాతం నగదును పాడి రైతు చెల్లించాల్సి వుంది. చెల్లించలేని పక్షంలో బిల్లు మొత్తంలో తగ్గించి చెల్లిస్తారు. రెండు పాడి ఆవుల షెడ్డుకు రూ.1.50 లక్షలు, నాలుగు ఆవుల షెడ్డుకు రూ.1.85 లక్షలు, ఆరు ఆవుల షెడ్డుకు రూ.2.30 లక్షలు ప్రభుత్వం చెల్లిస్తోంది.

రూ.16 కోట్ల బకాయిలు చెల్లించాలి

జిల్లావ్యాప్తంగా చేపట్టిన గోకులం షెడ్ల నిర్మాణ పనులకు రూ.16 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఉపాధి హామీ నిధులతో గోకులం షెడ్ల నిర్మాణాలు చేపట్టడం జరిగింది. జిల్లాలో 2173 షెడ్లు మంజూరైతే 1393 షెడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. గత ఏడాది డిసెంబరు నుంచి బిల్లుల చెల్లించాల్సి ఉంది.

- రవికుమార్, డ్వామా పీడీ

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9703618708, 9030367786
9703618705, 9703618710
9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

CHANGE OF NAME

I, PRAMMASANI RAJENDRAN (Old Name), S/o Late P. Krishnama Naidu, residing at 31-74, Sai Nagar Colony, Santhapet, Chittoor, Chittoor Dist, 517004, A.P hereby declare that I have changed my name as PRAMMASANI RAJENDRA (New Name) for all future purposes

AJT -4588

CHANGE OF NAME

I, Dhama Aruna (Old Name) W/o Dhama Nadhamuni, R/o D.No:6-88/2, Bajana Gudi Street, Tiruchanur, Tirupati Rural Mandal, Tirupati Distr.,- 517 503., A.P., India, I have Changed my Name to DAMA ARUNA (New Name) W/o DAMA NADHAMUNI. Henceforth, I will be known as DAMA ARUNA (New Name)W/O DAMA NADHAMUNI.

AJT -1131

CHANGE OF NAME

I, M.C.KISHORE Father of M.K.BHUVIKA REDDY, resident of H.No.10-4B, Kota Street, Nagalapuram Village, Post and Mandal, previously Chittoor District, at present Tirupati District, Andhra Pradesh. My Daughter's former name M.K.BHUVIKA REDDY D/o M.C.KISHORE (Old Name) and in the place thereof, I do hereby assume from this date the name MOKSHADA MUDUCHURI D/o M.C.KISHORE New Name).

AJT -1133

PLOTS FOR SLAE

6 లక్షలకే తిరుపతి IIT, IISER విద్యా సంస్థల ప్రక్కన ఫైనల్ అప్రూవ్డ్‌తో ప్లాట్లు డైరెక్ట్ ఓనర్ స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్ : 95027 74175 / 79959 92114.

AJT - 1135

వధువు కావలెను

తిరుపతి, వయసు 42, ప్రైవేటు ఉద్యోగం, రెండు సొంత ఇండ్లు ఉన్నవి. మొదటి పెళ్లి, కుల పట్టింపు లేదు. మొదటి, రెండో పెళ్లి వధువు పిల్లలు లేని వధువు పర్వాలేదు. వరుడికి వధువు కావలెను. సంప్ర 88863 35559

AJT - 200798

స్థలం అమ్మకము

⇒ Tirupati Near Vadamalapet Toll Gate off NH 205, 2.5 Acrs high rise land, Suitable for School, College any Commercial activites : Contact : 9445253860.

AJG-210708

PASSPORT LOST

I, R SUSHMA LAL C/o K BALA MURALI PRASAD, R/at. DNo. 19-3-23, FLAT NO.101, Ruthvika Homes Anand Constructions, Kennedy Nagar, Tirupati Urban (M), Tirupati District-517 501, A.P. INDIA, do hereby declare that I have lost my original passport issued by Concerned Authority of Hyderabad, vide bearing No.B1003979, issued on 4/11/1999 expired 03-11-2009, while I am shifting my house to Tirupati. If anyone finds it please contact me at above address.

AJT -200864

CHANGE OF NAME

I, Pokuri Deenadayal S/o Adhikesavala (Old Name), R/o 7-32, Krishnapuram, Kalroadpalli, Chandragiri (M), Tirupati Dist., 517112, A.P., India I have Changed my Name to POKURI DEENADAYAL NAIDU (New Name). Henceforth, I will be known as POKURI DEENADAYAL NAIDU (New Name) S/o POKURI ADHIKESAVULU NAIDU (New Name).

AJT - 1130

CHANGE OF NAME

I, M.C.KISHORE Father of M.K.YUKTHIKAA REDDY, resident of H.No. 10-4B, Kota Street, Nagalapuram Village, Post and Mandal, previously Chittoor District, at present Tirupati District, Andhra Pradesh. My Daughter's former name M.K.YUKTHIKAA REDDY, D/o M.C. KISHORE (Old Name) and in the place thereof, I do hereby assume from this date the name MAHANNYA MUDUCHURI, D/o M.C. KISHORE (New Name).

AJT -1132

COMPUTER EDUCATION

FREE Courses: DCA, DTP, MS-OFFICE (Lab Fee Only), PAID Courses: DCA, PGDCA, DTP, TALLY, MS-OFFICE, Spoken English Etc. Cont : SSCT, 663, Bhavani Nagar, Tirupati, 94407 06077.

AJT - 1127

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టు మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర: 7382114647.

AJA- 227128

పాఠకులకు ముఖ్యగమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం

● పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ●

బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని.. ప్రజలు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించి ఆదరించాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. మండలంలోని తీర్థం గ్రామంలో గురువారం సాయంత్రం పలమనేరు నుంచి తీర్థం మీదుగా దాసార్లపల్లెకు నూతన బస్సు సర్వీసును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పలమనేరు ఆర్టీసీ డిపోకు రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు ఉండేదని, గత ప్రభుత్వంలో ఇక్కడి డిపో బస్సులను వేరే డిపోలకు తరలించేశారన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని మళ్లీ బస్సు సర్వీసులను పునరుద్ధరించడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం హంద్రీ-నీవా కాలువ లైనింగ్ పనులు జరుగుతున్నాయని.. అవకాశం ఉన్నచోట రైతుల సౌకర్యం కోసం చెరువులు, కుంటలకు హంద్రీ-నీవా జలాలను డైవర్షన్ చేయడానికి తగిన



ఆర్టీసీ బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

చర్యలు చేపడుతామన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు చెప్పారు. అనంతరం అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లపట్టాలు పంపిణీ చేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యంశెట్టి, పలమనేరు ఆర్టీసీ డిపో మేనేజర్ స్వామి, అసిస్టెంట్ మేనేజర్ లక్ష్మీనారాయణ, తహసీల్దార్ మాధవరాజు, ఎంపీడీవో రాజేంద్రబాలాజీ, ఎస్‌ఐ పరశురాముడు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

క్రీడలు ఐక్యతను పెంపొందిస్తాయి



ఆటగాళ్లతో ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్ఆర్.కృష్ణారావు

కుప్పం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసికోల్లాసం ఇవ్వడమేకాకుండా అందులో పాల్గొనే వారి మధ్య ఐక్యతా బంధాన్ని పెంచుతాయని పీఈఎస్ వైద్య కళాశాల డీన్, ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్ఆర్.కృష్ణారావు అన్నారు. పీఈఎస్ వైద్య కళాశాలలో గురువారం డాక్టర్స్ ప్రీమియం లీగ్ - 13 ఎడిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వైద్య విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది మధ్య ఈ క్రీడలు స్ఫూర్తితోపాటు బంధాన్ని పెంచుతాయని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 13 మంది ఎంపిక

చౌడేపల్లె, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సీడప్ గ్రామీణాభివృద్ధి ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 13 మంది ఎంపికైనట్లు ఏపీఎం సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించిన జాబ్ మేళాలో 53 మంది నిరుద్యోగులు పాల్గొనగా 13 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్ట్ ప్లేస్‌మెంట్ ట్రైనర్ లోకేష్, జాబ్స్ కోఆర్డినేటర్ రెడ్డమ్మ, సీసీలు పాల్గొన్నారు.



జాబ్ మేళాలో పాల్గొన్న అధికారులు

రాళ్లగంగమాంబ ఉత్సవాల ప్రారంభం




రాళ్లగంగమాంబ అమ్మవారు, ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న వేద పండితులు

గుడుపల్లె, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రైల్వేస్టేషన్ క్రాస్‌లో కొలువైన ప్రసన్న రాళ్లగంగమాంబ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం అంకురార్పణతో వైభవంగా ప్రాంభమయ్యాయి. ఉదయం గంగమ్మ మూల విగ్రహానికి అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని రంగుల పుష్పాలతో అలంకరించారు. ఆలయం ఆవరణలో వేద పండితులు ప్రత్యేక హోమాలు నిర్వహించారు. అనంతరం మంగళ వాయిద్యాల నడుమ వేద పండితులు ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక పుష్పాలలో అలంకరించి ఊరేగించారు. కుమ్మర చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు బాబు నాయుడు, నేతలు హేమాంబర్ గౌడు, సుబ్రహ్మణ్యం, ఆలయ కమిటీ సభ్యులు చంద్రప్ప, బోడెప్ప, భాణుమూర్తి, వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర దిగుబడులు

చౌడేపల్లె, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవ సాయంతోనే భూములు సారవంతమవుతాయని.. ఆరోగ్యకర పంట దిగుబడులను సాధించవచ్చని జిల్లా రైతు సాధికార సంస్థ డీపీఎం మహేష్ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువులు వాడటంతో భూమి నిస్సారమవుతుందని.. ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. రైతులు సేంద్రియ ఎరువులను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం సుబ్రహ్మణ్యం, వీవోలు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఆర్‌వైఎస్ఎస్ అధికారులు

తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యత



చెత్తకుప్పల తొలగింపు పనులను పరిశీలిస్తున్న అధికారులు

సోమల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో తాగునీటి సమస్యలు పరిష్కరించడానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీవో నారాయణ తెలిపారు. గురువారం మండలంలోని వడ్డిపల్లె, ఇరికిపెంటల్లో తాగునీటి సరఫరా పైపులైను పనులను ఆయన పరిశీలించారు. అలాగే ఇరికిపెంట వద్ద రోడ్డు ఇరువైపులా చెత్తకుప్పల తొలగింపు పనులను పరిశీలించి లక్ష్మీపురం గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రతపై పలు సూచనలు చేశారు. అనంతరం సచివాలయంలో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ లక్ష్మీదేవి, పంచాయతీ కార్యదర్శి మేనక, మాజీ సర్పంచి శ్రీనివాసులు నాయుడు, ఆవులపల్లె పంచాయతీలో సర్పంచి కోదండరాజు, కార్యదర్శి మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే టీడీపీకి అండ



సభ్యత్వ కార్డులు అందజేస్తున్న నేతలు

రామకుప్పం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలే టీడీపీకి కొండంత అండ అని ఆ పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు తెలిపారు. గురువారం రామకుప్పం పార్టీ కార్యాలయంలో మండలంలోని పార్టీ పంచాయతీ అధ్యక్షులకు సభ్యత్వ నమోదు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ పార్టీలో లేని విధంగా టీడీపీ కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో నేతలు మహ్మద్‌రఫీ, గజేంద్ర, జయశంకర్, సత్తి, వెంకటాచలం, విజయ్‌కుమార్‌రెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటరమణ, చంద్రశేఖర్‌రెడ్డి, రామలింగారెడ్డి, బాబు, గుణశేఖర్, జేయి, జ్ఞానశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటా: ఎంపీ

సదుం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి కార్యకర్తకు అన్ని వేళలా అండగా అందుబాటులో ఉంటానని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి తెలిపారు. సదుం ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికారులు అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ రెడ్డెప్ప, ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి

నేడు మామిడి రైతులకు అవగాహన సదస్సు

చౌడేపల్లె, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మామిడి రైతులు, కొనుగోలుదారులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఉద్యానశాఖ అధికారిణి సంతోషికుమారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు తప్పకుండా సమావేశానికి హాజరు కావాలని కోరారు.

పేదరిక నిర్మూలనకు పీ-4

శాంతిపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన కోసం సీఎం చంద్రబాబు నాయుడు ప్రతిపాదించిన విధానమే పీ-4 అని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ...దేశంలో ఇప్పటి వరకు ప్రభుతంవ, ప్రైవేటు సంస్థలతో పాటు ప్రజలను భాగస్వామ్య విధానం ఉండగా అందులో ప్రజలను భాగస్వామ్యం చేయాలనేదే పీఎం ఆలోచన అన్నారు. దేశంలో సంపద సృష్టి జరుగుతున్న అది కొందరి చేతుల్లోనే ఉండిపోతుందని...ఈ పీ4 విధానం అమలు చేస్తే అట్టడుగు వర్గాల అభ్యున్నతికి తోడ్పడి ఫలితంగా పేదరికం నిర్మేలన సాధ్యమవుతుందని చెప్పారు. పేదరికం కారణంగా సమాజంలో ఏ ఒక్కరు వెనుకబడకుండా పౌరులందరికీ సమాన అవకాశాలు, సామాజిక భద్రతను కల్పించడం వెనకబడిన వర్గాల అభివృద్ధికి అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

రొంపిచెర్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్లలో గ్రామ దేవత ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారికి అభిషేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

టెన్త్ ఫలితాలకు ముందే ఇంటర్‌లో ప్రవేశాలు

రొంపిచెర్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష ఫలితాలు రాకముందే ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని రొంపిచెర్ల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ సరళ పేర్కొన్నారు. గురువారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ 2025-26 విద్యా సంవత్సరాన్ని ఈ ఏడాది ఏప్రిల్ లోనే ప్రారంభించిన నేపథ్యంలో ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో చేరే విద్యార్థులకు మే 22 వరకు నమోదు ప్రక్రియకు మే 22 వరకు గడువు ఇచ్చారన్నారు. పదో తరగతి మెరిట్ ఆధారంగా, రిజర్వేషన్ రూల్స్ ప్రకారం అడ్మిషన్లు ఉంటాయని తెలిపారు. వివరాలకు ఫోన్‌నంబరు 9849387564 ను సంప్రదించాలని కోరారు.

అసంపూర్తిగా తరగతి గదుల నిర్మాణం



రొంపిచెర్ల ఉర్దూ పాఠశాలలో అసంపూర్తి నిర్మాణం

రొంపిచెర్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల ఉర్దూ పాఠశాలలో తరగతి గదుల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతున్నారు. నాడు నేడు పనులతో ఆరు తరగతి గదులు నిర్మాణానికి సుమారు రూ.కోటి నిధులు మంజూరైతే కేవలం రూ.36 లక్షలు మాత్రమే వినియోగించి నాలుగు గదులు పనులు చేపట్టారు. అయితే రెండు గదులు అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. ఉర్దూ జడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో సుమారు 180 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అధికారులు స్పందించి తరగతి గదులు, ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అర్ధాంతరంగా ఆగిన కల్వర్టు పనులు



కందూరు-మేటిమంద మార్గంలో ఆగిపోయిన కల్వర్టు

సోమల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుపతి - పుంగనూరు మార్గంలోని చెన్నపట్నం చెరువు క్రాస్ రోడ్డు నుంచి మేటిమంద, కందూరుకు వెళ్లే ప్రధాన రహదారి లో గత ఐదేళ్ల క్రితం కల్వర్టు పనులకు రూ.60 లక్షలతో శ్రీకారం చుట్టారు. రహదారిలో గాడితీసి వదిలేశారు. అప్పటి నుంచి పనులు పూర్తి చేయకుండా వదిలేయడంతో మరో మార్గంలో రాకపోకలు సాగిస్తున్నారు. వర్షాకాలంలో ఈ మార్గంలో ప్రయాణం గగనమవుతోంది. అధికారులు స్పందించి కల్వర్టు పూర్తి చేయాలని కోరుతున్నారు. ప్రస్తుతం కందూరు, కలికిరి, నిమ్మనపల్లె తదితర ప్రాంతాల వాహనాలు ఈమార్గం నుంచే పుంగనూరు, పలమనేరు మార్కెట్‌కు పోవడంతో ఇబ్బందిగా మారిందని వాపోతున్నారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందిస్తున్న కళాశాల అధ్యాపకులు

పుంగనూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ సర్వేపల్లె రాధాకృష్ణన్ విద్యామిత్ర పథకంతో ఉచితంగా విద్యార్థులకు నోటుపుస్తకాలు అందజేస్తున్నట్లు బసవరాజ ప్రభుత్వ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ కమలాకర్ తెలిపారు. గురువారం కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ప్రభుత్వ కాలేజీల్లోనే చేరాలని ఆయన కోరారు.

పెద్దల నుంచి రక్షణ కల్పించండి - ప్రేమ జంట విజ్ఞప్తి

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): 'ప్రేమ వివాహం చేసుకున్నాం.. పెద్దల నుంచి రక్షణ కల్పించండి' అని చౌడేపల్లె మండలం బీర్జేపల్లెకి చెందిన అనూహ్య, చిట్టిరెడ్డిపల్లెకు చెందిన వంశీ కోరారు. గురువారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడారు. తాము ఏడేళ్లుగా ప్రేమించుకుంటున్నామని చెప్పారు. కులాలు వేరు కావడంతో తమ తల్లిదండ్రులు పెళ్లి అంగీకరించలేదన్నారు. తాము మేజర్లు కావడంతో వివాహం చేసుకున్నామని తెలిపారు. అందువల్ల తమ కుటుంబ పెద్దల నుంచి ప్రాణహాని ఉందని పోలీసు ఉన్నతాధికారులు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.



వంశీ, అనూహ్య

కుప్పం డిపో పూర్వ వైభవానికి కృషి చేస్తా

- ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం

కుప్పం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కుప్పం ఆర్టీసీ డిపో పూర్వ వైభవానికి కృషి చేస్తానని ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం హామీ ఇచ్చారు. కుప్పం డిపో స్థితిగతులపై ఆయనకు ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం సమర్పించారు.



పీఎస్ఎంకు వినతిపత్రం సమర్పిస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు

ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ కుప్పం డిపోలో 105 బస్సులు ఉండగా.. వాటిలో 56 పల్లె వెలుగు బస్సులు 15 లక్షల కిలోమీటర్లు తిరినవేనన్నారు. ఈ బస్సులు స్క్రాప్‌కు వచ్చి ఎక్కడపడితే అక్కడ ఆగిపోయి మరమ్మతులకు గురవుతున్నాయని చెప్పారు. అలాగే ప్రమాదాలకు ఈ బస్సులు కారణమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటి స్థానంలో ఉమ్మడి జిల్లాలోని 16 డిపోల నుంచి ఒక్కోదానికి కనీసం 5 బస్సుల చొప్పున డిపోకు తెప్పించాలన్నారు. అలాగే సప్తగిరి ఎక్స్‌ప్రెస్ బస్సులు 18 తెప్పించాలని కోరారు. గ్యారేజ్‌లో ఆర్వో ప్లాంట్‌ను పునరుద్ధరించి తాగునీటి సౌకర్యం కల్పించాలని విన్నవించారు. దీనిపై స్పందించిన పీఎస్ఎం మాట్లాడుతూ విజయవాడలో త్వరలో జరిగే బోర్డు సమావేశంలో చర్చించి కుప్పం డిపోకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు అవసరమైన ప్రతిపాదనల కోసం కృషి చేస్తానని యూనియన్ నాయకులకు, కార్మికులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కుప్పం డిపో మేనేజరు ఎం.గోపీనాథ్, అసిస్టెంట్ మేనేజరు ఎం.దినేశ్, ఎన్ఎంయూఏ డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.మునస్వామి, ఈ.జయపాల్, యూనియన్ నాయకులు బొట్టు మణి, జి.మునెప్ప, ఎస్ఏ.శేషాద్రి, అరుణ్, ఖలీల్, శీను, ప్రసన్న, రామచంద్ర, భాస్కర్ పాల్గొన్నారు.

● ఎన్ఎంయూఏ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా పెండింగులో ఉన్న ఉద్యోగుల సమస్యలను ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్, చైర్మన్లకు విన్నవించినా పరిష్కారం కానందుకు నిరసన తెలిపారు. మొత్తం 38 డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ఈ సందర్భంగా యూనియన్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కరాటేతో ఆత్మవిశ్వాసం

ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

గంగవరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): శారీరక ఉల్లాసంతో పాటు ఆత్మవిశ్వాసానికి మార్షల్ ఆర్ట్స్ ఉపయోగపడుతుందని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం పలమనేరు పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటుచేసిన వీకే మార్షల్ ఆర్ట్స్ అకాడమీని ఎమ్మెల్యే ప్రారంభించారు. మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థుల ప్రతిభను చూసి చిన్నవయస్సులో కరాటేలో రాణించడం సంతోషంగా ఉందన్నారు. ప్రధానంగా కరాటే ఆడపిల్లలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో బాలాజీ సూపర్‌బజార్ అధ్యక్షులు ఆర్‌వీ బాలాజీ, ఆర్‌బీసీ కుట్టి, గిరిబాబు, ఖాజా, నాగరాజు, మదన్, కిరణ్, గంటావూరు శ్రీధర్, రమేష్, సురేష్, సుధాకర్, మోహన్, రామ్మూర్తి పాల్గొన్నారు.



కరాటేలో తలపడుతున్న పిల్లల నైపుణ్యాన్ని తిలకిస్తున్న ఎమ్మెల్యే

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పుంగనూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆర్టీసీ ఎన్ఎంయూఏ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపో ముందు నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు రామకృష్ణ మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని, నైట్ అవుట్ అలవెన్స్‌లను రూ.400 చేయాలని, హయ్యర్ పింఛన్‌ను అమలు చేయాలని, ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, ఈ.హెచ్.సీ విధానానికి బదులు పాత వైద్య విధానం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డిపో మేనేజర్ సుధాకరయ్యకు అందజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు, ఉద్యోగులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఎన్ఎంయూఏ సంఘ నాయకులు

పౌష్టికాహారంతోనే పిల్లల ఆరోగ్యం

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే పిల్లలు ఆరోగ్యవంతులుగా ఉంటారని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అమేషానజీతాజ్ పేర్కొన్నారు. పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని రాంపల్లె అంగన్‌వాడీ కేంద్ర పరిధిలో గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న కార్యకర్తలు

హంస వాహనంపై కాశీవిశ్వేశ్వరుడి దివ్యతేజం

రామకుప్పం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రామకుప్పంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఐదో రోజైన గురువారం స్వామివారు సతీ సమేతంగా హంస వాహనోత్సవంలో ఊరేగారు. ఉభయదారులు వెంకట్రమణ నాయుడు సోదరుల ఆధ్వర్యంలో ఉదయం స్వామి వేదపండితులు స్వామి వారి మూలమూర్తికి రుద్రాషేకం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు నిర్వహించి విశేష అలంకరణలు చేశారు. సతీ సమేతుడైన కాశీవిశ్వేశ్వర స్వామి ఉత్సవర్లను మేళతాళాలు, డప్పుల హోరు మధ్య మాడ వీధుల్లో ఊరేగించారు. రాత్రి స్వామి, అమ్మవార్లు హంస వాహనంపై ఊరేగారు. భక్తులకు అన్నదానం చేశారు.



రామకుప్పం మాడ వీధుల్లో ఊరేగుతున్న అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరుడు

కోర్టుకు హాజరైన ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

గంగవరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో పెట్టిన అక్రమ కేసులకు సంబంధించి పలమనేరు ఎమ్మెల్యే అమరనాధరెడ్డి గురువారం కోర్టుకు హాజరయ్యారు. అక్రమ కేసుల వాయిదాలలో భాగంగా పలమనేరు కోర్టుకు స్థానిక నాయకులతో కలిసి వెళ్లారు. ఎమ్మెల్యేతో పాటు నాయకులు ఆర్‌వీ బాలాజీ, బైరెడ్డిపల్లె కిషోర్ గౌడు, ఆర్‌బీసీ కుట్టి, కిరణ్‌కుమార్, జగదీష్, గంటావూరు శ్రీధర్, నదీమ్‌ల పాల్గొన్నారు.

నంది వాహనంపై సోమేశ్వరస్వామి విహారం



పుంగనూరు రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జమీందార్ ప్యాలెస్ వద్ద వెలసిన సోమేశ్వరస్వామి నందివాహనంపై పుర వీధుల్లో ఊరేగారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ప్రత్యేకంగా అలంకరించి పుష్పపల్లకీలో ఊరేగించారు. భక్తులు స్వామి వారికి హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

21న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మోడల్ పాఠశాలలో ఆరోతరగతి లో ప్రవేశాలకు నిర్వహిస్తున్న ప్రవేశ పరీక్ష ఈనెల 21న ఉంటుందని ప్రిన్సిపాల్ డాక్టర్ రమా తెలిపారు. ఈనెల 20న రాయాల్సిన పరీక్షను 21వ తేదీకి మార్పు చేసినట్లు పేర్కొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక ఆదాయం

సోమల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ వ్యవసాయంతో అధిక ఆదాయం పొందొచ్చని ఏపీఎం శివ తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రసాయని ఎరువులు వినియోగంపై నష్టాలు వివరించారు. సమావేశంలో సీసీలు వాహిద్‌బాషా, మునిరత్నం, గంగోజీ, సంఘమిత్రలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.


వక్ఫ్ సవరణ బిల్లుపై మైనార్టీలకు అవగాహన

పుంగనూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఈనెల 20 నుంచి మే 5 వరకు వక్ఫ్ సవరణ బిల్లుపై మైనార్టీలకు అవగాహన కల్పించనున్నట్లు బీజేపీ మైనార్టీ నాయకుడు అయూబ్‌ఖాన్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం మైనార్టీల అభివృద్ధికి వక్ఫ్ సవరణ బిల్లు తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. కొంత మంది అనవసరంగా వక్ఫ్ సవరణ బిల్లుపై తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు వివరించారు. కేంద్ర ప్రభుత్వం గుర్తించి మైనార్టీలకు అవగాహన కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కేసులు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతూ పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ లోకేశ్ తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న నలుగురుపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే మద్యం తాగి ద్విచక్రవాహనాలు నడుపుతున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టణంలో ట్రాఫిక్‌కు ఇబ్బందిగా రోడ్డుపై ఉన్న 10 తోపుడుబండ్ల యజమానులపై కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఎస్వీ సెట్‌లో 'సెలెస్టా' ప్రారంభం



పూతలపట్టు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ముత్తిరేవుల సమీపాన ఉన్న శ్రీవేంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎస్వీ సెట్)లో గురువారం సెలెస్టా 2కె25 కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా చైర్మన్ రావూరి వెంకటస్వామి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడమే సెలెస్టా లక్ష్యమని చెప్పారు. వైస్‌చైర్మన్ రావూరి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ మోహన్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ లోకనాథం రెడ్డి, రాజా రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం ఏడు గంటల ప్రాంతంలో జగన్నాథం చిత్రం హీరో భరత్, స్కూల్ లైఫ్ చిత్రం హీరో పులివెందుల మహేష్, సినీ దర్శకుడు బాచిలు సెలెస్టా వేదికపైకి రావడంతో విద్యార్థుల్లో జోష్ నింపింది.

కమనీయం.. సీతారాముల కల్యాణం



విజయపురం, కోలావూరులో సీతారాముల కల్యాణోత్సవం

విజయపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కోదండరామాలయంలో సీతారాముల కల్యాణోత్సవం గురువారం కమనీయంగా జరిగింది. ఉదయం గోపూజ, కలశస్థాపన, తదితరాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి సీతారాముల వారిని పురవీధుల్లో ఊరేగించారు. ఆలయకమిటీ చైర్మన్ కొండూరు అశోకరాజు దంపతులు, పురోహితుడు వందవాసి మహేష్‌శర్మ పాల్గొన్నారు.

గుడిపాల: మండలంలోని కోలావూరులోని ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. పురోహితుడు మహేష్ శర్మ, జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకుడు చెన్నకేశవులు నాయుడు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వేడుకగా గంగ జాతర



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నిండ్ర, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కావనూరు పంచాయతీలో గంగజాతరను వేడుకగా నిర్వహించారు. బుధవారం రాత్రి అమ్మవారిని విశేషంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు నైవేద్యం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారిని నడివీధిలో ప్రతిష్ఠించగా, గురువారం నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ దర్శించుకున్నారు. సాయంత్రం అమ్మవారిని గ్రామశివార్లలో నిమజ్జనం చేశారు.

సూర్య, చంద్రప్రభ వాహనాలపై అగస్త్యేశ్వరుడు



సూర్యప్రభ వాహన సేవలో పాల్గొన్న ఉభయదారులు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కామాక్షి అంబికా సమేత అగస్త్యేశ్వరాలయంలో పంగుణి మాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం స్వామి, అమ్మవార్లకు ఆలయ అర్చకుడు శివకుమార్ శివాచార్యులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఉదయం బి.జమున, గణేష్‌సింగ్ ఉభయంతో సూర్యప్రభ, సాయంత్రం చిత్తూరు రజక సంఘం ఉభయంతో చంద్రప్రభ వాహన సేవలను ఆలయ ఈవో వెంకటరాయలు నిర్వహించారు. ఆలయ సిబ్బందితోపాటు కాలభైరవట్రస్టు వ్యవస్థాపకుడు టి.వెంకటేషన్, లత జ్యువెలరీస్ అధినేత మల్లి ఆచారి, శ్రీకలెక్షన్స్ బద్రీనారాయణ దంపతులు పాల్గొన్నారు.

వేణుగోపాలుడి అలంకరణలో రాముడు



స్వామివారి ఊరేగింపులో పాల్గొన్న ఉభయదారులు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కోదండరామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం స్వామివారిని వేణుగోపాల స్వామి అలంకరణలో ఆలయ ఈవో సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో పురవీధుల్లో ఊరేగించారు. భక్తుల ఆధ్వర్యంలో వసంతోత్సవం నిర్వహించారు. సాయంత్రం సింగపూరు సుబ్రహ్మణ్యం, ధర్మేంద్ర, చిట్టిబాబు, చర్చివీధి కోదండరామలయ వ్యాపార సముదాయం వర్తకుల ఉభయంతో గజవాహన సేవ జరిగింది. శుక్రవారం రథోత్సవం జరగనుందని ఈవో తెలిపారు.

వైభవంగా ఆది దంపతుల కల్యాణం



నగరి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని కామాక్షి సమేత కరకంతేశ్వరస్వామి ఆలయంలో పంగుణోత్తర ఉత్సవాల్లో భాగంగా కల్యాణోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం హోమపూజలు, మూలవర్లకు అభిషేకం, అర్చనలు చేశారు. అనంతరం ఆది దంపతులకు కల్యాణోత్సవం జరిగింది. నగరి శివాలయ కమిటీవారు, ఎం.కస్తూరి, కృష్ణారెడ్డి, ఏఎం రాధాకృష్ణ, ఉభయదారులు పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త సుబ్రహ్మణ్యం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ముత్యాలమ్మ ఆలయ కుంభాభిషేకం

గుడిపాల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బసవాపల్లె పంచాయతీ సీకేపల్లెలో గురువారం ముత్యాలమ్మ ఆలయ కుంభాభిషేకాన్ని గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పురోహితుడు సుధాకర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వైసీపీ చిత్తూరు సమన్వయకర్త విజయానందరెడ్డి, మండల అధ్యక్షుడు రాసనపల్లి ప్రకాష్, నగర అధ్యక్షుడు కేపీ శ్రీధర్, సర్పంచ్ సునీల, సుధాకర్ నాయుడు పాల్గొన్నారు.

రేపు పౌర్ణమి గిరి ప్రదక్షిణ

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గిరింపేట వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరాలయంలో శనివారం పౌర్ణమి గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నట్లు ఈవో వెంకట సుబ్బారెడ్డి తెలియజేశారు. భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.

వన్‌సైడ్ పార్కింగ్‌కు సహకరించండి: డీఎస్పీ



నో పార్కింగ్ బోర్డులను చూపుతున్న పోలీసులు

నగరి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నగరి పట్టణ పరిధిలో గురువారం నుంచి వన్‌సైడ్ పార్కింగ్ అమలు చేసినట్లు, వాహనదారులు సహకరించాలని డీఎస్పీ అజీజ్ కోరారు. టవర్‌క్లాక్ వద్ద నుంచి పళ్లిపట్టు రోడ్డులో కొత్తపేట వద్ద ఉన్న అగర వినాయకస్వామి గుడి వరకు, ప్రకాశం రోడ్డులో టవర్ క్లాక్ వద్ద నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు వన్‌సైడ్ పార్కింగ్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం నో పార్కింగ్ బోర్డులను కూడా సిద్ధం చేశామన్నారు. నిబంధనలపై వారం రోజుల వరకు వాహనదారులకు అవగాహన కల్పిస్తామని చెప్పారు.

ఉపకరణాల పంపిణీ



నగరి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): భవిత పాఠశాలలో విభిన్న ప్రతిభావంతులకు సహాయ ఉపకరణాలను నగరి మండల విద్యాశాఖాధికారి నమశ్శివాయ గురువారం పంపిణీ చేశారు. వీటిల్లో వీల్‌చైర్లు, బ్యాటరీతో నడిచే ట్రైసైకిళ్లు, వినికిడి యంత్రాలు ఉన్నాయి. సహిత ఉపాధ్యాయురాలు భవాని, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

దుకాణాల వేలంతో రూ.68.25 లక్షల ఆదాయం

తవణంపల్లె, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయంలో గురువారం నిర్వహించిన శాశ్వత దుకాణాల బహిరంగ వేలంతో రూ.68,25,600 ఆదాయం సమకూరినట్లు ఈవో హనుమంతరావు తెలిపారు. 10 శాశ్వత దుకాణాలకు సంబంధించి మూడేళ్ల కాలానికి వేలం నిర్వహించారు. పాటదారులు, దేవదాయశాఖ అధికారి సుమనప్రియ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులను నోటికొచ్చినట్లు మాట్లాడతారా ?

- జగన్‌పై టీడీపీ నేతల మండిపాటు

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పోలీసులను నోటికొచ్చినట్లు మాట్లాడతారా అంటూ మాజీ సీఎం జగన్‌పై టీడీపీ నాయకులు మండిపడ్డారు. ఈ మేరకు తెలుగు యువత మాజీ కార్యనిర్వాహక జిల్లా కార్యదర్శి దేవపత్ని ధనంజయనాయుడు, పార్లమెంట్ టీడీపీ వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి కామసాని కోదండరెడ్డి, సింగిల్‌విండో మాజీ డైరక్టర్ కామసాని విజయకుమార్‌రెడ్డి, నియోజకవర్గ టీడీపీ ముస్లిం మైనారిటీ ప్రధానకార్యదర్శి నియాజ్‌అలీ, నియోజకవర్గ టీఎన్‌టీయూసీ ప్రధానకార్యదర్శి బోడిరెడ్డి రుషేంద్రరెడ్డి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు



చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఐఎన్‌టీఎస్‌వో ఒలంపియాడ్ పోటీ పరీక్షల్లో గ్రాండ్ ప్రైజ్‌తో పాటు గోల్డ్ మెడల్, ఫస్టు ప్రైజ్ సాధించిన చిత్తూరు శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులను గురువారం కలెక్టర్ సుమిత్ కుమార్ తన చాంబర్‌లో అభినందించారు. విద్యార్థుల వెంట కళాశాల ఏజీఎం సురేష్, ఆర్‌ఐ చక్రధర్ ఉన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీస్‌లో 'పోషణ్ పక్వాడా'లో భాగంగా గురువారం మహిళలు, అంగన్వాడీ టీచర్లకు పౌష్టికాహారంపై అవగాహన సమావేశం నిర్వహించారు. సీడీపీవో గుండ్లపల్లె వినతశ్రీ, వ్యవసాయాధికారి భవాని, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అనురాధ, నాగరత్నమ్మ, భాగ్యలక్ష్మి, సంగీత, సిబ్బంది పాల్గొన్నారు.

గుడిపాల: శ్రీరంగంపల్లె ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ స్వర్ణలతాదేవి, హెచ్ఎం జయంతి, వీఆర్వో కరుణాకర్, అంగన్వాడీ టీచర్ జ్యోతి, లక్ష్మీకాంత పాల్గొన్నారు.



శాతంబాకం సమీపంలో..



కలవగుంట వద్ద..



గంగుపల్లె చెరువు వద్ద..

ఈ రోడ్లను బాగు చేసేదెప్పుడు?

పెనుమూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు నుంచి చిత్తూరు వెళ్లే మార్గంలో చాలా చోట్ల రోడ్లు ధ్వంసమయ్యాయి. గుంతలతో నిండిన ఈ దారులపై ప్రయాణించడానికి వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పెద్దరాజుపల్లె సమీపంలో రోడ్డుపై పెద్ద గుంతలు ఏర్పడటంతో రాత్రిపూట ప్రమాదాలు జరుగుతున్నాయి. గంగుపల్లె చెరువు వద్ద రోడ్డు పనుల్లో భాగంగా ఎన్నికలకు ముందు కొంతదూరం రోడ్డును తవ్వేశారు. ఆపై రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో ఇరుకు రోడ్డులో వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఇటీవల ఓ కారు బోల్తాపడి ఇద్దరు తీవ్రగాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. కేసీ ఒడ్డిగుడిసెలు సమీపంలో రోడ్డుపై పెద్ద గుంతలు పడ్డాయి. బీసీ కాలనీ మలుపు వద్ద సంక్రాంతి రోజు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మరణించాడు, మరొకరికి కాలు విరిగింది. అధికారులు ఇప్పటికైనా ఈ రోడ్లను బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వరసిద్ధుడి ఆలయ పరిసరాలు శుభ్రంగా ఉండాలి: ఈవో



కల్యాణకట్ట వద్ద మరుగుదొడ్లను పరిశీలిస్తున్న పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడి ఆలయ పరిసరాలు శుభ్రంగా ఉండాలని సిబ్బందికి ఈవో పెంచలకిషోర్ సూచించారు. గురువారం ఈఈ వెంకటనారాయణతో కలసి పలు ప్రాంతాలను పరిశీలించారు. ఈవో మాట్లాడుతూ కల్యాణ కట్ట, బస్టాండ్‌లోని మరుగుదొడ్లను ఎప్పకప్పుడు శుభ్రం చేయాలని చెప్పారు. పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. కల్యాణ కట్టలో క్షురకులు భక్తులకు గుండ్లు గీసే సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఆలయ పరిసరాల్లో పరిశుభ్రత లోపిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం: జగన్మోహన్



టీడీపీ నాయకులతో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తామని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తెలిపారు. గురువారం లాయర్స్ కాలనీ, ఎస్పీ బంగ్లా రోడ్డులో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేస్తున్నామని చెప్పారు. నగరంలో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి తగిన ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. లాయర్స్ కాలనీ ప్రజల వినతిమేరకు సిమెంటు రోడ్డు, కాలువను నిర్మించామని, మిగిలిన పనులను రెండు, మూడు నెలల్లో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం ఎస్పీ బంగ్లా రోడ్డులో వర్షపునీటి ప్రవాహం కోసం రూ.25లక్షలతో నిర్మించిన మేజర్ కాలువను ఎమ్మెల్యే ప్రారంభించారు. మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, కమిషనర్ నరసింహప్రసాద్, సహాయ కమిషనర్ ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పరిశీలకుడు సునీల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న రాహుల్

శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కల్గుతుందని ప్రభుత్వ విప్ థామస్ కుమారుడు రాహుల్ అన్నారు. గురువారం పెద్ద తయ్యూరు సమీపంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ గురువారంతో ముగిసింది. 24 జట్లు తలపడ్డాయి. పిచ్చాటూరు మండలం ఉత్తరపుకండ్రిగ జట్టు విన్నర్స్‌గా నిలిచి, రూ.50వేలను సొంతం చేసుకుంది. రన్నర్స్‌గా గంగాధర నెల్లూరు మండలం బుక్కపట్నం జట్టు నిలవగా రూ.25వేల బహుమతిని నిర్వాహకులతో కలిసి రాహుల్ అందజేశారు. ప్రభుత్వ విప్ పీఏ చంద్రశేఖర్, టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, బాలు, నిర్వాహకులు చిరంజీవి, నరేష్, పెద్ద తయ్యూరు యూత్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతోనే అధిక దిగుబడి సాధ్యమవుతుందని మండల వ్యవసాయాధికారి భవాని తెలిపారు. జిల్లా రైతుసాధికార సంస్థ సహకారంతో గంగాధరనెల్లూరులో వ్యవసాయ, మహిళా సమాఖ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో వార్షిక ప్రణాళిక సమావేశం జరిగింది. మాస్టర్ ట్రైనర్ విజయ, వెలుగు ఏపీఎం ఫరీద్ మస్తాన్, సీసీలు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పిల్లలకు రుచికరమైన భోజనం పెట్టండి

గుడిపాల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు రుచికరమైన భోజనం పెట్టాలని ఎంఈవో-2 గణపతి, విద్యాకమిటీ చైర్‌పర్సన్ టీఆర్ డిల్లీబాయి సూచించారు. గురువారం నరహరిపేట జడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన నిర్వహణను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి



నాగరాజ్ (ఫైల్ ఫొటో)

గుడిపాల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నారగల్లు పంచాయతీ మాజీ సర్పంచ్ నాగరాజు (51) గురువారం అనారోగ్యంతో మృతిచెందాడు. నాగరాజు మృతి పార్టీకి తీరని లోటని, వారి కుటుంబానికి అండగా ఉంటామని టీడీపీ సీనియర్ నాయకులు చెన్నకేశవులు నాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు, హరిబాబు, దేవ, రూప్‌కుమార్ తదితరులు తెలిపారు.

తలపులపల్లె పరిసరాల్లో నెమలి సంచారం



పూతలపట్టు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తలపులపల్లె గ్రామ పరిసరాలకు గురువారం ఓ నెమలి రావడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామ సమీపాన ఉన్న అటవీ ప్రాంతం నుంచి ఇది వచ్చింది. జనాన్ని చూడగానే తిరిగి ఆ నెమలి అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయిందని సమాచారం.

పెద్దల నుంచి రక్షణ కల్పించండి: ప్రేమ జంట విజ్ఞప్తి



వంశీ, అనూహ్య

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పెద్దల నుంచి రక్షణ కల్పించండి అని చౌడేపల్లె మండలం బీర్జేపల్లెకి చెందిన అనూహ్య, చిట్టిరెడ్డిపల్లెకు చెందిన వంశీ కోరారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడారు. తాము ఏడేళ్లుగా ప్రేమించుకుంటున్నామని చెప్పారు. కులాలు వేరు కావడంతో తమ తల్లిదండ్రులు పెళ్లి అంగీకరించలేదన్నారు. తాము మేజర్లు కావడంతో వివాహం చేసుకున్నామని తెలిపారు. తమ కుటుంబ పెద్దల నుంచి ప్రాణహాని ఉందని పోలీసు ఉన్నతాధికారులు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

సారా స్థావరాలపై దాడులు

- అర టన్ను నల్లబెల్లం, లగేజీ వ్యాను స్వాధీనం: ఇద్దరి అరెస్టు



[illegible]

విజయపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కేవీపురంలో గురువారం సాయంత్రం నగరి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది నవోదయం 2.0లో భాగంగా సారా స్థావరాలపై విస్తృతంగా దాడులు నిర్వహించారు. దాడుల్లో అర టన్ను నల్లబెల్లం, 10 లీటర్ల సారా, లగేజీ వ్యానును స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడుకు చెందిన నటరాజన్, పాండ్యన్‌ను అదుపులో తీసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎవరైనా సారా తయారీ, విక్రయాలపై టోల్ ఫ్రీ నెంబరు 14405 లేదా 94409 02549 నెంబరుకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు. సమాచారం ఇచ్చినవారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

గంజాయి అమ్మకాలపై నిఘా పెట్టాలి

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గంజాయి అమ్మకాలపై నిఘా పెట్టి కట్టడికి చర్యలు తీసుకోవాలని చిత్తూరు అర్బన్ తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం తన కార్యాలయంలో రెవెన్యూ, పోలీసు అధికారులతో డ్రగ్ కంట్రోల్ సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాస్, వన్ టౌన్, టూ టౌన్ సీఐలు మహేశ్వర్, నెట్టికంఠయ్యలతో కలిసి మాట్లాడారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

పెనుమూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామచంద్రయ్య తెలిపారు. జీడీనెల్లూరు మండలం బందార్లపల్లికి చెందిన రాకేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. గత శనివారం తన బంధువు సురేంద్రరెడ్డితో ద్విచక్ర వాహనంలో పెనుమూరు నుంచి బందార్లపల్లెకి రాకేష్ బయల్దేరాడు. ఉగ్రాణంపల్లెకి డిల్లీప్రసాద్ మరో ద్విచక్ర వాహనాన్ని నిర్లక్ష్యంగా నడిపి వీరి వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సురేంద్రరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని పెనుమూరు సీహెచ్‌సీకి, ఆపై మెరుగైన చికిత్స కోసం వేలూరు సీఎంసీకి తరలించారు. దీనిపై గురువారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



రాజేంద్రనాయుడు (ఫైల్ ఫొటో)

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఎగువకామినాయనపల్లెకు చెందిన పి.రాజేంద్రనాయుడు(65)తన భార్య లక్ష్మితో కలసి ద్విచక్ర వాహనంపై జంగాలపల్లె నుంచి ఐరాల వైపు బుధవారం రాత్రి బయల్దేరాడు. పట్నంకు చెందిన హరీష్ తన ద్విచక్ర వాహనంపై ఐరాల నుంచి కాణిపాకం వస్తున్నాడు. జంగాలపల్లె బస్టాప్ వద్దకొచ్చేసరికి రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రాజేంద్రనాయుడు, హరీష్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని అంబులెన్స్‌లో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాజేంద్రనాయుడు మృతి చెందాడు. హరీష్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం రాణిపేట సీఎంసీకి తరలించారు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గురువారం కాణిపాకం ఏఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

నిరుపేదలకు అన్నదానం



మద్రాసు బాబు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సుబ్రహ్మణ్యం నాయుడు, తదితరులు

గుడిపాల, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత మద్రాసు బాబు వర్ధంతి సందర్భంగా గురువారం నిరుపేదలకు అన్నదానం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు మాట్లాడుతూ.. మద్రాసు బాబు పార్టీకి ఎనలేని సేవలు చేశారని గుర్తు చేసుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, కార్యాలయ కార్యదర్శి కిట్టు, నాయకులు నాగరాజ యాదవ్, సాంబశివ నాయుడు, చందు, ఏకాంబరం, గోపి, గురుస్వామి నాయుడు, దొరబాబు, వాసురెడ్డి, శివలింగారెడ్డి, సుబ్రహ్మణ్యం, జయదేవ నాయుడు, జయచంద్ర, మద్రాస్ బాబు అభిమానులు పాల్గొన్నారు.

ఎస్వీ సెట్‌లో 'సెలెస్టా' ప్రారంభం





సినీ నటుడు కిరణ్ అబ్బవరం అభివాదం- డ్యాన్సు చేస్తున్న విద్యార్థులు

పూతలపట్టు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ముత్తిరేవుల సమీపాన ఉన్న శ్రీవేంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎస్వీ సెట్)లో గురువారం సెలెస్టా 2కే25 కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా చైర్మన్ రావూరి వెంకటస్వామి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడమే సెలెస్టా లక్ష్యమని చెప్పారు. వైస్‌చైర్మన్ రావూరి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ మోహన్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ లోకనాథం రెడ్డి, రాజా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సినీ హీరోల సందడి: సాయంత్రం ఏడు గంటల ప్రాంతంలో జగన్నాథం చిత్రం హీరో భరత్, స్కూల్ లైఫ్ చిత్రం హీరో పులివెందుల మహేష్, సినీ దర్శకుడు బాచిలు సెలెస్టా వేదికపైకి రావడంతో విద్యార్థుల్లో జోష్ నింపింది. స్కూల్‌లైఫ్ చిత్రంలోని 'చిత్తూరు చిన్నదాన.. నీ మనసులో నేలేనా..' అనే పాటను లాంచ్ చేశారు. ప్రముఖ సినీ నటుడు కిరణ్ అబ్బవరం కూడా వేదికపై సందడి చేశారు. ఈ సందర్భంగా కేరళ డ్రమ్స్, విద్యార్థుల డ్యాన్సులు అలరించాయి.

సంక్షిప్తంగా..

గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి 13న పరీక్షలు

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ఫస్టియర్ ప్రవేశాలకు ఈనెల 13వ తేదీన పరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు స్థానిక బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ దమయంతి తెలిపారు. ఐదో తరగతిలో ప్రవేశానికి ఉదయం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇంటర్ ఫస్టియర్ వారికైతే మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్‌తోపాటు ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకువాలని సూచించారు.

నేడు పూలే జయంతి వేడుకలు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించనున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం దక్షిణాది రాష్ట్రాల ఇన్‌చార్జి పి.షణ్ముగం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఎనిమిది గంటలకు ఏఎంఎం మున్సిపల్ కాంప్లెక్స్‌లోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో పూలే చిత్రపటానికి, తొమ్మిది గంటలకు పీసీఆర్ కాలేజీ సమీపంలోని విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పిస్తామన్నారు. 10గంటలకు బీసీ భవన్‌లో వేడుకలు జరుగుతాయని పేర్కొన్నారు.

పాలసముద్రంలో వర్షం

పాలసముద్రం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు వర్షం కురిసింది. ఈ వర్షం.. చెరకు, కొబ్బరి తోటలకు అనుకూలమని రైతులు తెలిపారు.

విధుల్లో అలసత్వం వద్దు

పాలసముద్రం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): విధుల్లో అలసత్వం వద్దని సచివాలయాల్లో పనిచేసే సిబ్బందిని ఇన్‌చార్జి ఎంపీడీపీ విద్యావతి ఆదేశించారు. గురువారం కృష్ణజిమ్మాపురం, పి.కావేరిరాజుపురం సచివాలయాలను తనిఖీ చేశారు. ఈవోపీఆర్డీ రమేష్, కార్యదర్శి జయశంకర్ పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కల్గించొద్దు

నగరి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నగరి పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కల్గిస్తే చర్యలు తప్పవని సీఐ విక్రమ్ హెచ్చరించారు. గురువారం పోలీస్‌స్టేషన్ వద్ద చిరువ్యాపారస్తులకు నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. రోడ్డుపైన దుకాణాల సామగ్రి, తోపుడుబండ్లు పెట్టడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని చెప్పారు.

పేడ దిబ్బలు తొలగించండి

వెదురుకుప్పం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన పేడ దిబ్బలు తొలగించాలని కార్వేటినగరం ఎంపీడీవో చంద్రమౌళి ఆదేశించారు. గురువారం కొల్లాగుంట వద్ద పేడ దిబ్బలను తొలగించారు. సర్పంచ్ దివ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

వైభవంగా ద్రౌపది కల్యాణం

పెనుమూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): శాతంబాకంలో జరుగుతున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా గురువారం ద్రౌపది కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

చెత్తాచెదారం తొలగింపు

విజయపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బూచివానత్తంలోని అంకమ్మ కాలనీ వీధుల్లో చెత్తాచెదారాన్ని గురువారం తొలగించారు. ఈ పనులను సర్పంచ్ గోపాల్, ఎంపీడీవో రాజేంద్ర, పంచాయతీ కార్యదర్శి సంపూర్ణ పర్యవేక్షించారు.

రేపు తూగుండ్రంలో సీతారాముల కల్యాణం

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తూగుండ్రంలోని వెంకటేశ్వర పెరుమాళ్ దేవస్థానం ఆవరణంలో ఉన్న సీతారామ లక్ష్మణ హనుమంత ఆలయంలో శనివారం రాత్రి సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఈమేరకు ఆలయ ధర్మకర్త కె.రామస్వామి శేఖర్ మొదలి తెలిపారు. కుమారి మాచర్ల వీణచే కర్ణాటక సంగీత కార్యక్రమం, హరికథా కాలక్షేపం ఉంటుంది.